# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



VOLUME 31 ISSUE 11
No. OF PAGES 40
JULY 2012

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| అద్భుతమైన వధువు. | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 15 |
| పరిప్రశ్నేన సేవయా | 18 |
| శివానందలహరి | 19 |
| మౌన ధ్యాన సప్తాహ శిబిరం | 21 |
| తోడు నీడ | 23 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 26 |
| ఉచిత పుస్తక వితరణ దృశ్యాలు. | 27 |
| ఆధారంలేని సిద్ధాంతం | 28 |
| అపరోక్షానుభూతి | 30 |
| శ్రీ శుకబ్రహ్మాశ్రమము-ఆహ్వానము | 32 |
| కోపాన్ని జయించటం ఎట్లా ? | 33 |
| తనపని తానే చేసుకొనవలె | 35 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

కర్తా కారయితాచైవ ప్రేరకశ్చాను
మోదకః శుభాశుభ కర్మ ఫలంచ
త్వార సమభాగినః

సద్గురు దేవులు, సాధకులు గురుమూర్తియడల ఎంత వినయ విధేయత కల్గియుండాలో వివరిస్తూ పైన చెప్ప బడిన శ్లోకాన్ని గుర్తు చేస్తూ ఉండేవారు. తాను ఆశ్రయించిన గురుమూర్తిని మానవాకారంలో ఎన్నడూ చూడరాదు. అంతేకాదు సాధకుని సమక్షంలో ఎవరైనా సద్గురు మూర్తి చర్యను గాని మరి యే ఇతర విషయము గూర్చిగాని విమర్శించినపుడు తగిన సమాధానము చెప్పాలి, లేకపోతే అక్కడనుంచి తొలగిపోవాలి అని హెచ్చరించేవారు. సాధకుడు అటువంటి విమర్శలు చేసినా, విమర్శలు చేసినప్పుడు తటస్థంగా ఊరకున్నా దానిని ఆమోదించి నట్లవుతుంది సుమా! దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదు. దుష్కృత కర్మ చేసినవాడు, దానికి సహాయ పడినవాడు, దానిని ఆమోదించినవాడు, అందరూ శిక్షార్హులే. కర్మ ఆచరించకపోయినా దానిలో ఏదో రకమైన భాగస్వామి అయితే అది అకర్మలో కర్మ అవుతుంది సుమా అని సద్గురు దేవులు హెచ్చరించేవారు. అటువంటి నిస్సహాయ స్థితిలో నీవు ఆశ్రయించిన సద్గురు మూర్తిని స్మరించినట్లయితే ఆయన అనుగ్రహానికి పాత్రుడవై రక్షణ జరుగుతుంది. అది కర్మలో అకర్మ అని పిలువబడుతుంది. గురునామ స్మరణ మరవని వానికి అటువంటి పరిస్థితి తటస్థపడదు.

పరాశర ప్రసాద్
గౌరవ సంపాదకుడు

# యోగి వేమన

4. అనువుగాని చోటఁ బనిగొని జూదము
నాడి యాడి యోడి యడవి సొచ్చు
ఘనుని జాడఁజూచి గడువుము మూర్ఖత

తాత్పర్యము –

మూర్ఖుడు తన కనువుగాని స్థలమున జూదమాడి ఓడి పోయి అడవులకు పోవును. ధర్మరాజు దీని కుదాహరణము. దీనిని గమనించి మూర్ఖత్వము విడిచి ప్రవర్తింపుము.

5. అలయఁజేసి మలచి యడిగండ్లు మలిగండ్లు
తిరిపెమిడెడడు కటికదేబెలెల్ల
నెలమి మన్నుదినెడి యెఱ్ఱలౌదురు సుమీ

తాత్పర్యము –

అతిథిని త్రిప్పి త్రిప్పి నానా బాధలు పెట్టి బిచ్చము పెట్టు మూర్ఖులు మరుజన్మలో మట్టి తినెడి ఎఱ్ఱలు (వానపాములు) గా పుట్టుదురు.

6. అభిజాత్యముననె యాయువున్నంతకుఁ
దిరుగుచుండ్రు భ్రమలఁ దెలియలేక
మురికి భాండమునను ముసరునీఁగలరీతి

తాత్పర్యము –

మూర్ఖులు బ్రతికి యున్నంతకాలము మురికి కుండలో ఈగలు ముసురుకొని యున్న రీతిని, 'నేను గొప్పకులమున పుట్టినాను' అని అహంకరించి తిరుగుదురు. తాము భ్రాంతి పడుచున్నట్లు వారికి తెలియదు.

# శ్రీబాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

అ పరిశ్రమ యజమాని తనకూ, తన కార్మికులకూ క్షేమాన్ని కోరేవాడైతే యీ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి.

1. తాను ఉత్పత్తి చేసే వస్తువు యొక్క నాణ్యత స్వదేశ విదేశాలలో మెప్పించేదిగా వుండాలి.



2. సంస్థ ఆర్జించే కీర్తి దినదినాభివృద్ధి చెందాలి. ఆ సంస్థ పేరే నాణ్యతకు చిహ్నంగా మారిపోవాలి.

3. ఆ సంస్థ వల్ల దేశానికి కీర్తి ప్రతిష్టలు కలగాలి.

4. పరిశ్రమ యజమానిని, శ్రామికులను మాత్రమే గాక, దేశాన్ని కూడ సంపద్వంతం చెయ్యాలి.

5. ఆ పరిశ్రమలో కొన్ని వేలమంది శ్రామికులు పనిచేస్తారు. యజమాని తన కుటుంబసభ్యుల యోగక్షేమాలను ఎలా వాంఛిస్తాడో అలాగే ఆ శ్రామిక కుటుంబాల యోగక్షేమాలను కూడ కోరుకోవాలి.

6. ఆ పరిశ్రమ ద్వారా తాను ఆర్జించే ద్రవ్యం కేవలం తనదీ, కార్మికులదీ మాత్రమే కాదనీ, దానిలో దేశానికి కూడా పాలు వున్నదనీ అతడు గుర్తించాలి.

7. వీటన్నిటిని మించిన గురుతరమైన బాధ్యత మరొకటి ఉన్నది. అది ఆధ్యాత్మికం. తాను స్థాపించిన సంస్థకు నిజమైన యజమాని భగవంతుడనీ, తాను ఆ ప్రభువు ప్రతినిధినని మాత్రమే గుర్తించాలి. తాను అత్యధిక లాభాలను గడించటానికి ప్రయత్నించాలిగాని, అలా సంపాదించిన ద్రవ్యం నిజంగా భగవంతుడిదేనని అతడు గుర్తించాలి.

ఇలా భావిస్తూ, పైన చెప్పిన మార్గదర్శక సూత్రాలను పాటిస్తూ, తాను ధర్మబద్ధంగా సంపాదించిన ద్రవ్యంలో వీలైనంత మిగిల్చి దానిని దైవకార్యాలకూ, ధర్మకార్యాలకూ వినియోగించి నప్పుడే తన యజమానియైన భగవంతునిపట్ల తన విధిని నిర్వర్తించి నట్లౌతుంది.

ఏ పారిశ్రామిక వేత్తయైనాసరే, యిలా చక్కగా ఆలోచించి ప్రవర్తిస్తే, అతడెప్పుడూ ధర్మమార్గాన్నుండి వైదొలగడు. అధర్మానికి పూనుకోడు. అత్యధిక లాభాల కోసం అతడు శ్రమించినా, అతడిలో పేరాశ వుండదు. తనక్రింది ఉద్యోగులనూ,

కార్మికలనూ బాధించడు. ప్రభుత్వాన్ని, ప్రజలనూ మోసగించవలసిన అవసరం అతడికి వుండదు. అతని సంస్థలో సమ్మెలకూ, లాకౌట్లకూ అవసరం రాదు, విచారణ సంఘాల ప్రమేయం వుండదు. మధ్యవర్తిత్వాల ప్రస్థావనే రాదు. రానురాను తన కృషి ఒక ఆధ్యాత్మిక తపస్సుగా అతనికి అనుభవంలోనికి వస్తుంది. ఈ కృషిద్వారానే అతడు భగవంతుడి ప్రేమకు పాత్రుడై, ఆధ్యాత్మిక శిఖరాలను అందుకోగలడు.

ఇలా ఆచరించిన పారిశ్రామికవేత్త తన కుటుంబసభ్యుల ప్రేమాదరణాలను చూరగొనటమేగాక తన సంస్థలో పనిచేసే అందరికీ ఆత్మీయుడు కాగలుగుతాడు. ఉదారహృదయుడైన ధార్మికుడుగా అతడు స్వదేశ విదేశాలలో రాణించగలడు.

అంతేకాదు తన ఆచరణద్వారా అతడు తన క్రింది ఉద్యోగులకు, శ్రామికులందరికీ ఆదర్శప్రాయుడైనిల్చి, తనవలెనే వాళ్ళనుగూడ తమ విధి నిర్వహణను కర్మయోగసాధనగా భావించే స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని ఇవ్వగలడు. అటువంటి యజమానిలో ఆ ఉద్యోగులు ఒక అధినేతనేగాక, తమను ప్రేమించే పితృసమానుడైన ఉదారుడినీ, తమ కుటుంబాల అభ్యున్నతిని కోరే స్నేహితుని, తమ ఐహిక ఆధ్యాత్మిక పురోభివృద్ధిని కోరే మహాత్ముని, తమకు మార్గదర్శకుడైన ఒక ఆదర్శమూర్తిని చూడగలరు. ఇలా అర్ధం చేసుకొన్న ఉద్యోగులు తమలోని సంకుచితత్వాన్ని విడనాడి సౌభ్రాతృత్వం పెంపొందించుకుంటారు, తమ విధులను చక్కగా నిర్వర్తించడం ద్వారా తమ యజమానినే గాక, భగవంతుణ్ణికూడ సంప్రీతుణ్ణి చేసుకోగలమని తెలుసుకొని శాయశక్తులా శ్రమిస్తారు, అభివృద్ధి సాధిస్తారు.

ఇటువంటి ఆదర్శవంతమైన అవగాహన వలన అనేక వాంఛనీయమైన శుభ పరిణామాలు సంభవిస్తాయి. ఒక మహెూన్నత కృషిలో కార్మికులు కేవలం పనివారు మాత్రమేగాక భాగస్వాములుగా, సంఘీభావమూ సౌభ్రాతృత్వమూగల ఆదర్శ కార్యవాదులుగా మారి సంస్థను అత్యున్నత శ్రేణికి చేర్చగలరు. వాళ్ళ కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లుతాయి. ప్రభుత్వానికి వాళ్ళవల్ల అందవలసినంత సహకారం అందుతుంది. ప్రభుత్వం కూడ వాళ్ళ కష్టసుఖాలను గమనిస్తుంది. ఇతర సంస్థలు గమనించి, పరిశీలించి, అనుకరించవలసిన స్థాయిని ఆ యజమానీ, కార్మికులూ చేరుకుంటూరు.

ఈ మహత్తర శుభపరిణామ పరంపరకు సంతోషించి దయామయుడైన భగవానుడు ఆ సంస్థపైన, ఆ ఉద్యోగులపైన, ఆకార్మికులపైన, వారి కుటుంబ సభ్యులపైన తన దయావృష్టి కురిపించగలడు.

-సశేషం

(గత సంచిక తరువాయి)

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాల ప్రసాద

స్వధర్మాన్ని ఆచరించమని మహాత్ములు బోధిస్తున్నారు. అలాగే "త్యాగేనైకే అమృతత్వమానసు" అని చెప్తోంది శృతివాక్యం. త్యాగము ఒక్కదాని చేతనే అమృతత్వం లభిస్తుంది. ఎందరో భక్తులు ఒక్కొక్క వస్తువునిచ్చి జీవితాన్ని ధన్యత చేసుకుంటున్నారు. వారు ఇచ్చిన ఒక రాయి మీద ఎంతమంది మహాత్ముల పాదస్పర్శ పడుతోంది! ఆ రాయి ఎంతమందికి సేదదీరుస్తోంది! ఇదంతా త్యాగ లక్షణమే కదా! నీవాళ్ళకు నీవు దానం చేయడం గొప్ప కాదు. అది త్యాగం అనిపించుకోదు. ఎవరయితే నావాళ్లు అనుకుంటున్నావో, వారందరూ ఏనాడో ఓనాడు నిన్ను వదలి వెళ్ళిపోయేవాళ్ళే. చివరికి నీవెప్పుడూ వంటరివే. అయినా కూడా మమకారం అనేది మానవుడిని ఎంత గాఢంగా పెనవేస్తుందో మీకొక ఉదంతం చెపుతాను. నేను ఒకాయనతో అన్నాను, "నాయనా! నువ్వు ఎందుకయ్యా ఇంత కష్టపడుతున్నావు? నువ్వు చేసే పనిని నీ పిల్లలకి నేర్పించవచ్చు కదా - అది నీకు ముందు ముందు సహాయంగా వుంటుంది" అని అంటే, ఆయన, 'నాకింకొక్క నాలుగేళ్ళు ఇవ్వండమ్మా. మిగతా వాటి గురించి తర్వాత చూద్దాం' అన్నాడు.



ఆహా! ఈ దేహం మీద ఎంత అభిమానం! అదే మమకారం. గారెలు ఇష్టం కదా అని ఎన్ని గారెలు తినగలడా మానవుడు? ఎక్కువ తింటే ఏమవుతుందో మీ అందరికీ బాగా తెలుసు. తినే నాలుకకి కడుపు సంగతి తెలియదు. కడుపుకి గారి సంగతి తెలియదు. చూసే కన్ను చెప్పలేదు. నోరు వినలేదు. అయినా, ఇవన్నీ కలిపి 'నేను' అనుకుంటున్నాము. ఇందులో ఏది "నేను"? అద్దం నిజమా? అద్దంలో ప్రతిబింబిస్తున్న మనం నిజమా? అక్కడ లింగాకృతిలో వున్న స్వామి ఇందులో (ఈ దేహంలో) వున్న 'నేను' నిజమని చెప్తున్నాడు. తలవంచి వుంటే 'శివత్వం' - తల ఎత్తితే 'శవత్వం'. అంటే ఈ దేహంలో వుండి నడిపిస్తున్నవాడు ఆ శివుడే అనే నిజం తెలుసుకున్న వాడు వినమ్రుడై వుంటాడు. అలా కాకుండా, ఈ శరీరం చేసేదంతా నా ప్రజ్ఞే అనుకునేవాడు శవత్వాన్నే పొందుతాడు.

మానవులు అనవసరమైన ప్రసంగాలతోటి ఎంతో అమూల్యమైన కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటున్నారు. ఎక్కడో ఎవరికో ప్రమాదం జరిగితే, దాని గురించి గంటలు గంటలు ఈ**DISCUSSIONS** (ప్రసంగాలు) చేసుకునే బదులు, ఒక 10 నిమిషాలు ఆ ప్రమాదం జరిగిన వారి గురించి భగవంతుడిని ప్రార్ధన చేసుకుని, ధ్యానం చేసుకుంటే, వారికి మంచి జరిగి తీరుతుంది. అంతేగానీ గంటలు కొద్దీ చేసే ప్రసంగాల వల్ల ఏమీ జరగదు. అంతేకాక, "మా దేవుడు గొప్ప, అంటే మా దేవుడు గొప్ప" అని కొట్లాటలు! "దేవుళ్ళు" లేరు. ఉన్నది ఒక్కటే దేవుడు. ఇంగ్లీషులో దేవుడిని **GOD** అంటారు.

**G = Generator** - సృష్టించేవాడు

**O = Organiser** - పోషించేవాడు **(operator)**

**D = Destroyer** - లయం చేసేవాడు

నా అనుభవంలో అన్నిటికంటే గొప్పది "గురుశక్తి". కృష్ణ శక్తి, రామశక్తి, జగన్మాత శక్తి అన్నీ ఒక్కటే. 'శక్తి'లో తేడాలు లేవు. హెచ్చుతగ్గులు లేవు. దేనిని నమ్మినా అదే గొప్పది అనే స్థిర భావన కలిగివుండాలి.

మానవుడికి అన్నిటికంటే ఇష్టము 'తాను'. ఆఖరుకి వీడియోలో గురుమహరాజ్‌ని చూస్తున్నా, మనమెక్కడున్నాం అందులో అని వెతుక్కుంటాం. భగవంతుడికి కావాలసిందికూడా "నేను"ను చూసుకోడమే. కేవలం 'చూసుకోవడం' కాదు - అనుభవించాలి. నా అనుభవంలో అన్నిటికంటే గొప్పది "గురుశక్తి". కృష్ణ శక్తి, రామశక్తి, జగన్మాత శక్తి అన్నీ ఒక్కటే. 'శక్తి'లో తేడాలు లేవు. హెచ్చుతగ్గులు లేవు. దేనిని నమ్మినా అదే గొప్పది అనే స్థిర భావన కలిగివుండాలి.

మనం కలలో అనేక దృశ్యాలు చూస్తాం, కష్టాలనుభవిస్తాం, ఏడుస్తాం కూడా. నిద్ర లేచాక 'ఆ! అది కలా?' అనుకుంటాం. దేహంతో వున్న మానవునికి ఇదంతా కలే - భ్రాంతే. లోపల వున్న ఆత్మని తెలుసుకోలేకపోతున్నాడు కనుక, ఈ దేహమే నిజమనే కలలో పడి సుఖదుఃఖాలని అనుభవిస్తున్నాడు. గురుకృప వలన జ్ఞానమనే మెలకువ కలిగినప్పుడు ఈ శరీరమనేది కేవలం అసత్యం అని తెలుసుకుంటున్నాడు. ఈ శరీరానికికి షడుర్మలున్నాయి. కాని 'తన'కి (ఆత్మకి) లేవని తెలుసుకుంటాడు.

- సశేషం

(గతసంచిక తరువాయి) 

# సన్నిధిలో సంభాషణ

-పరాశర ప్రసాద్

18-6-1985

ఈ రోజు శ్రీబాబు భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ అన్నింటికన్నా విలువైనది ఏది? కాలము. పోయిన వ్యక్తి తిరిగి వస్తాడా? వాడు బ్రతికి ఉండగా వాడి మాట వింటారా? చనిపోయినవాడి కీర్తి బారెడు. బ్రతికిఉన్నవాడి కీర్తి బెత్తెడు. భగవంతుని తత్త్వ విచారణలో ఉన్న మధురాన్ని గ్రోలడానికి అలవాటు పడిన మనస్సు దానిని వదులుకోదు. చీమ చూడండి తాను పట్టుకున్న పటిక బెల్లాన్ని వదులుతుందా? తన ప్రాణాన్ని త్యాగం చేయడానికి వెనుదీయదు. నేను అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ ఒక భక్తుడు మీరు భగవంతుణ్ణి దర్శించారా? అని ప్రశ్నించాడు. అలా ప్రశ్నించి నవ్వుతున్నాడు. వ్యంగ్యంగా నవ్వుతున్నట్లు అనిపించింది. ఆ ప్రశ్న రెండు అర్థాలు వచ్చేలాగ ఉంది. భగవంతుడు లేడని అర్థం వచ్చేలా ఉంది. అంతేకాక నన్ను పరీక్షిద్దామన్నట్లుగా ఉంది.

నేను వెంటనే ఆయన్ని ప్రశ్నించాను. మీరు కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నారు కదా! ఆఫీసుకు టైమ్‌కు వెళ్ళనందుకు మీకు రిమార్క్ వచ్చింది. ఆలస్యంగా వెళ్ళినందుకు మీకు జీతం కూడా కట్ చేశారు కదా! మీరు బ్రెడ్‌తో ఐస్‌క్రీమ్ తింటున్నారు. మీరు కడుపు నొప్పి అని చెప్పేది అంతా అసత్యం. నేను నమ్మను. కాని నేను భగవంతుణ్ణి నిన్ను చూసినట్లుగా చూస్తున్నాను. నీతో మాట్లాడినట్లుగా భగవంతునితో మాట్లాడుతున్నాను అన్నాను.

ఆయన వెంటనే మీరు భగవంతుణ్ణి చూసినట్లైతే నాకు చూపండి అన్నాడు. నేను వెంటనే ఆయన్ని ప్రశ్నిస్తూ 'మీరు రోజూ కడుపు నొప్పి అంటున్నారు కదా! ఆ నొప్పిని చూపండి. చూపకపోతే మీ డాక్టరుగారు కూడా ఇక్కడే ఉన్నారు కదా! ఆయన్ని మీ నొప్పిని ఒక రూపంగా చూపమనండి' అన్నాను. అయితే మీకు నొప్పి ఉందని నేను కూడా అంగీకరిస్తున్నాను. సందేహం లేదు. అది పొందినవాడికే తెలుస్తుంది కాని దానిని వేరొకరికి ఎలా చూపగలుగుతారు? అది అనుభవపూర్వకంగా తెలుసు కొనేదేగా! అలాగే జ్ఞాని కూడా పరమాత్మని అనుభూతిని పొందుతాడు. ఆ అనుభూతిని పొందేవాడి లక్షణాలు వేరేగా వుంటాయి.

పరమాత్ముడిని చూశాను అనేవాడికి, చూసి అనుభవించినవాడికి తేడా ఉంటుంది. రంగూన్‌రౌడీ నాటకంలో పాత్రధారి త్రాగినవాడి వలె నటిస్తూ

క్రిందపడేటప్పుడు జాగ్రత్త పడతాడు. లేకపోతే కాలుగాని, చెయ్యిగాని విరగవచ్చు. వాడికి ఆ నాటకం ఆడినందుకు ఇచ్చేది 500 రూపాయలు అయితే అతనికి 3000 రూ॥ ఖర్చు అవుతుంది. మూడు నెలలు హాస్పిటల్‌లో ఉండవలసి వస్తుంది. కాని నిజంగా త్రాగినవాడి ప్రవర్తన అలా ఉంటుందా?

ఈ బాబు మీకు భక్తి తీర్థాన్ని, జ్ఞాన తీర్థాన్ని అందించటానికి వచ్చిన ఇన్‌స్ట్రుమెంట్, బ్రహ్మ విష్ణు మహేశ్వరులందరూ ఆ నారాయణమూర్తిలో నుంచి వచ్చినవారే. భక్తుని హృదయమంటే గోవిందునికి ఇష్టం. భక్తుని హృదయంలో తయారైన దారము చాలా బలమైనది. అది మంచి పురి కలిగి ఉంటుంది. భగవంతుడు అటువంటి పురి అంటే విశ్వాసం కలిగిన భక్తునికే బంధితుడౌతాడు. భగవానుని దివ్య చరణారవిందాలు నీ హృదయంలో నిలిస్తే నీలో అజ్ఞానమనే ద్వైతం హరించి నీవెవరివో గుర్తించగలుగుతావు అన్నారు శ్రీబాబు.






భీమవరం రైల్వే స్టేషన్‌లో బాబు భక్తసమాజ్ వారు చలివేంద్రం ప్రారంభించిన దృశ్యం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**జూలై 2012**

**3 మంగ** ఆషాఢ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. (చాతుర్మాస్య దీక్ష ప్రారంభం)

జూలై నెలలో **చాతుర్మాస్య కార్యక్రమాలు** శ్రీమాతాజీవారు ఈ క్రింద సూచించిన ప్రకారం అనుగ్రహించారు)

**4-10** శ్రీ దండి నిర్మలానందగిరిస్వామి(అష్టలక్ష్మీ పీఠం, తెనాలి) వారిచే "అపరోక్షానుభూతి" పై ప్రసంగం.

**11 -17** శ్రీ సుందరకాండ సత్యన్నారాయణ(సిద్ధిపేట)గారిచే " సుందరకాండ" పురాణ ప్రవచనం.

18 - 24 ఆశ్రమ అంతేవాసులచే ఆధ్యాత్మిక ప్రవచనములు.

**13 శుక్ర** శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**16 సోమ** కర్కాటక సంక్రమణం దక్షిణాయణ ప్రారంభం

**17 మంగ** మాసశివరాత్రి

**27 శుక్ర** శ్రావణ శుక్రవారం - వరలక్ష్మీ వ్రతం

**ఆగష్టు 2012**

1 బుధ రాఖీపూర్ణిమ, (జంధ్యాల పూర్ణిమ) రక్షా బంధనం, సద్గురుపాదపూజ

**9 గురు నుండి 11శని వరకు శ్రీ కృష్ణాష్టమివేడుకలు**

9 గురు ఉదయం 10 గం.లకు కలశస్థాపన,శ్రీ రాధాకృష్ణ అర్చన, భక్త సమారాధన. రాత్రి 8 గం॥ లకు శ్రీసద్గురుపాదపూజ

10 శుక్ర ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురుపాదపూజ, 11 గం.లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

11 శని ఉదయం 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గం.లకుఉట్టి కొట్టుట

12 ఆది గురుదశమి సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

15 బుధ భారత స్వాతంత్ర దినము

16 గురు మాస శివరాత్రి

---

గమనిక - 8-24 తేదీలలో కార్యక్రమములోని మార్పును గమనించగలరు!

# అద్భుతమైన వధువు

– సుషుమ్న ప్రసాద

ఒకమారు గోదాదేవి తాను శ్రీమన్నారాయణునకు తగిన వధువునా, కాదాయని పరీక్షించు కొనటానికి యెన్నో అభరణములను అలంకరించుకొని, అద్దము ముందు నిలబడ్డది. అంతటితో తృప్తి నొందక, విష్ణుచిత్తులవారు వటపత్రశాయి నలంకరించుటకు పెట్టిన పూలమాలల బుట్టలో నుండి వొక పూలమాలను తీసుకొని, తన శిరోజములలోనలంకరించుకొన్నది. అద్దములో తన ప్రతిబింబాన్ని చూచి, స్వామికి తగిన వధువుగా వున్నానని తృప్తిచెంది, ఆ పుష్పగుచ్ఛమును తిరిగి పూలసజ్జలో పెట్టింది.
ఇలా స్వామివారికర్పించిన పుష్పములను తాను ముందుగా ధరించటమామె దిన చర్యగా మారింది. ఈ విషయము విష్ణుచిత్తునికి తెలియనే తెలియదు.

ఒక సందర్భములో, విష్ణుచిత్తుడు తన కుమార్తె స్వామివారికర్పించ వలసిన పుష్పమాలను తన శిరోజములలో నలంకరించుకొనటం గమనించాడు. విష్ణుచిత్తుడు వెంటనే తన కుమార్తె మహాపచారము చేసినదని భావించి, ఆగ్రహావేశముతో ఆమెను గట్టిగా మందలించి ఆ రోజు పుష్పమాలికలను దేవాలయమునకు తీసుకు వెళ్ళలేదు. ఆ రోజు రాత్రి విష్ణుచిత్తునకు స్వప్నములో ప్రత్యక్షమై, ఆ రోజు స్వామి కైంకర్యమునకు పూలమాలికలనెందుకు తీసుకరాలేదని ప్రశ్నించాడు. విష్ణుచిత్తుడు తాను దేవాలయమునకు తీసుకురాని కారణాలను స్వామికి వివరించాడు. వెంటనే స్వామివారు (స్వప్నములో) చిరునవ్వుతో గోద ధరించిన పుష్పమాలికలే తనకు ప్రీతికరమని, నిత్యమూ ఆమె అలంకరించుకొన్న తర్వాతనే పుష్పమాలికలను తెచ్చి తన కలంకరించమని ఆజ్ఞాపించాడు. వెంటనే విష్ణుచిత్తుడు మేల్కొని పరుగు పరుగున కుమార్తె వద్దకు వచ్చి ఇలా అన్నాడు "అమ్మా గోదా, నీవు నన్ను జయించావమ్మా, నీ భక్తి నా భక్తి కంటే ప్రగాఢమైనది, ఉన్నతమైనది". అప్పటి నుండి విష్ణుచిత్తుడామెను ఆండాళ్‌యని పిలవటం ప్రారంభించాడు. ఆండాళ్ అంటే విజయం సాధించిన వ్యక్తియని అర్థము. గోద ప్రేమను స్వామివారు సమ్మతించిరని గ్రహించి, అప్పటి నుండి ఆమె వివాహ విషయము ప్రస్తావించుట మాని వేశాడు.

గోద 108 దివ్యదేశముల (స్వామివారి పవిత్ర నిలయములు) ఆరాధ్య

దైవముల గురించి తెలుసు కొనవలయునని తీవ్రమైన ఆకాంక్షతో తన తండ్రిని ప్రశ్నించింది. విష్ణుచిత్తుడు వివరముగా వర్ణించి చెప్పాడు. అన్ని పవిత్ర క్షేత్రములలోని దైవములను గురించి వర్ణింపగా ఆమె కడకు శ్రీరంగ క్షేత్రమునకధినేత శ్రీరంగనాథస్వామిని తన నాధునిగ యెంచుకొన్నది. ఏ విధముగా ఒక మానవ కన్యకకు దేవాలయములోని అర్చమూర్తితో (విగ్రహము) పరిణయంకావటమెలా సంభవమాయని చింతిస్తూ, ఈ చిక్కుముడిని ఆ జగన్నాధుడే విప్పగల సమర్ధుడని, ఆ స్వామినే తీవ్రమైన ఆర్తితో ప్రార్ధించాడు.

శ్రీరంగనాథస్వామియే యీ సమస్యకు పరిష్కారమును సూచించాడు. విష్ణుచిత్తునకు స్వప్నములో సాక్షాత్కరించి గోదాదేవిని శ్రీరంగమునకు తోడ్కొని రమ్మనమని ఆజ్ఞాపించాడు. ఆమెను తన వధువుగా చేసుకొంటానన్నాడు. స్వామివారు దివ్యాలంకారముతో వివాహ శోభతో విలసిల్లుతున్న పల్లకిని శ్రీవిల్లిపుత్తూరుకు పంపాడు. గోదాదేవి తన పెంపుడు తండ్రితో పాటు దివ్యశోభాయమైన పల్లకిలో శ్రీరంగము చేరుకొన్నారు. ఆమె పవిత్ర దేవాలయములో ప్రవేశించి స్వామివారి దివ్య సౌందర్యమును తనివి తీర తిలకించగానే ఆమెలోని దివ్యతేజస్సు స్వామివారిలో లీనమై వారిద్దరి ఏకత్వము నిరూపింపబడ్డది. తక్షణమే స్వామి విష్ణుచిత్తునుద్దేశించి యిలా అన్నారు "విష్ణుచిత్తా, ఈ రోజునుండి మీరు నాకు మామగారు. ఇప్పటి నుండి మీరు పెరియాళ్వారు (అళ్వారులందరికి పెద్ద)గా పిలవబడతారు.

మహాలక్ష్మిగా మక్కువతో తాను పెంచిన పెంపుడుకూతురి యెడబాటు బాధపెడ్తున్నా తనముద్దుల కూతురు ఆండాళ్ స్వామివారి హృదయాన్నికూడ గెల్చుకొన్నదని, పెరియాళ్వారు పరమానంద భరితుడయ్యాడు.

***

గడ్డిపోచా, మొక్కా, వృక్షముల యొక్క ప్రతి వర్ణము ఇట్లు పలుకును. "మా వలెనే నీవును సర్వస్వము దానమొసగి, లోకమున జీవితమును సౌందర్యముతో నిండింపుము".

*** *** ***

నీ నామముకంటే ఘనమైనదొక్కటీ లేదు. ఎందుకన నామమే భగవంతుడు.

# గురు కృపాహి కేవలమ్

సేకరణ–రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

శ్రీ అమరా పురుషోత్తంగారు శ్రీబాబూజీ భక్తులు. శ్రీబాబూజీ అంటే ఎంతో విశ్వాసం ఉన్నవారు. ఆయన శ్రీబాబూజీతో మాట్లాడుతూ "నేను ఒక జ్యోతిష్కుడిని నా భవిష్యత్తును గురించి అడిగాను బాబూ! నా 'మృత్యువు దగ్గరలోనే ఉన్నది' అని చెప్పాడు. నేను నా కుటుంబ సమస్యలను పూర్తిగా పరిష్కరించుకోలేదు. నాకు చాల దిగులుగా ఉంది" అని శ్రీబాబూజీతో చెప్పారు.

పురుషోత్తంగారు చెప్పింది విన్న శ్రీబాబు "మీ ప్రాణానికి వచ్చిన భయమేమీ లేదు. మీ ఆయుర్దాయాన్ని పొడిగిద్దాం. ఆయుర్దాయాన్ని రాసేవాడు మనవాడైతే దాన్ని పొడిగించటానికి అభ్యంతరమేమున్నది. భయపడకండి" అని అభయమిచ్చారు. ఆ తరువాత శ్రీఅమరా పురుషోత్తంగారు చాలా సంవత్సరాలు జీవించారు. అలా ఎవరికి ఉంటుంది ఆ సామర్థ్యం? 'గురు సాక్షాత్ పరబ్రహ్మ' కే ఉంటుంది.

శ్రీబాబు ఒకసారి తమ ప్రసంగంలో "మానవుడు తన మేధస్సును వినియోగించి ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాడు. శ్రమపడి పెద్దపెద్ద కట్టడాలను నిర్మిస్తున్నాడు. ఇదంతా మానవశక్తి అనేగా మీరంతా భావించేది" అన్నారు శ్రీబాబు. ఇంకా మాట్లాడుతూ "ప్రతి మానవుడి ప్రజ్ఞను సమర్థిస్తాను. ప్రతిమానవుడిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. భగవానుడు ఒక్కొక్క మానవుడికి ఒక్కొక్క శక్తిని ప్రసాదిస్తాడు. ఒక వ్యక్తి చక్కగా పాడగలుగుతాడు. ఒక వ్యక్తి చక్కగా రచనలు చేయగలుగుతాడు. కాని ఆ ప్రతిభకు ఆధారమేమిటో ఎప్పుడైనా ఆలోచించారా? అది మనకు తెలియని రూపనామ క్రియారహితమైన ఒక శక్తి. దానినే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అంటారు. ఈ దేహంలోని ఇంద్రియాలన్నిటినీ చక్కగా పనిచేయించేది ఆ శక్తియే. నీకు ఆలోచనా శక్తినిచ్చేది, మేధస్సునిచ్చేది ఆ శక్తే అని గుర్తించండి."

"దానిని యీ క్షణంలోనే నిరూపణ చేయగలుగుతాను. ఇక్కడనే మన మధ్యలోనే ఉన్న (లెక్చరర్) పురోషత్తంగారు చక్కగా పాడగలుగుతారు. మంచి గాత్రం ఉంది. ఎంతో సమర్థవంతంగా సత్యహరిశ్చంద్రలోని పద్యాలు రాగయుక్తంగా పాడగలడు. ఈ ప్రజ్ఞ ఆయనదే అయినప్పుడు ఈ క్షణంలో ఆయన్ని పాడమనండి చూద్దాం" అన్నారు.

పురుషోత్తంగారు ఎంత ప్రయత్నించినా పాడలేకపోయారు. శ్రీబాబూజీ మహరాజ్‌వారికి నమస్కరించి తన అసమర్థతను తెలియచేస్తూ క్షమించమని కోరారు.

శ్రీబాబు వారిని ఆశీర్వదించి"చూశారా! మానవుని దేహం పరిణామంతో కూడినది. స్వయం ప్రకాశం లేనిది. ఎంతో చక్కగా పాడగల శక్తి ఉన్నా మీ దేహం సహకరించటం లేదు. మరి ఆ లోపం ఎవరిది? ఇక్కడ మీ ప్రజ్ఞ ఏమైనట్లు? మీ దేహపరిణామం వలననే కదా! పాడలేకపోతున్నారు. ఆ లోపం సరియైన క్షణంలోనే పాడగలుగుతారు కదా. ఈ ప్రజ్ఞ మానవుడిదే అని భావించే మీ వాదన వీగిపోయినట్లే కదా!

ఇప్పుడు చెప్పండి. మీరు ఈ దేహమా? ఎన్నటికీ కాదు. మీరు 'నేను, నాది' అనుకునేది కూడా ఈ దేహం కాదని గుర్తించండి. అదే 'ప్రజ్ఞానం బ్రహ్మ'. మీ గొంతు పాడటానికి సహకరించకపోవటానికి నా ప్రమేయం ఏమీ లేదు కదా!. నన్ను అపార్థం చేసుకోరు కదా! అలా భావించినా ప్రజ్ఞ మీ దేహానిది కాదని అంగీకరించినట్లే కదా!

మానవుడు ఏదైతే తన ప్రజ్ఞ అని భావిస్తాడో అదే గురుశక్తి. ఈ విషయాన్ని గ్రహించిన సాధకులు కష్టాలు వచ్చినప్పుడు దుఃఖించరు. సుఖం కలిగినప్పుడు పొంగిపోరు. అసలు సుఖదుఃఖాలను గుర్తించేది మనస్సే కదా! ఆ మనస్సు జడం. దానికి ప్రకాశాన్ని యిచ్చేది గురుశక్తి అని తెలిసినవాడికి దుఃఖం ఎందుకు కలగాలి? అంటే విశ్వాసంలో లోపం ఉన్నదన్నమాట.

దానిని సరిచేసుకునే మార్గం ఉంది. ఆదే గురుబోధా శ్రవణం. శ్రవణం చేసిన గురుబోధ సమయానికి మననానికి వచ్చి, అది అనుభవానికి వస్తుంది. ఆ అనుభవం గురుబోధా శ్రవణం పైన, మీరు చూపే శ్రద్ధ పైన ఆధారపడి వుంది. దానికి కావలసినది శమదమాది షట్క సంపత్తి" అన్నారు శ్రీబాబు.

*

ఎడబాటు (భిన్నత్వము) అను స్వప్నము నుండి మేలుకొనుము. వాడూ నీవూ విడియై (భిన్నులై) రెండుగా లేనట్లెరుగుము. బ్రతుకంతా ఒక్కటే.

*** *** ***

ప్రేమ క్షమా స్వభావము గలది, ప్రేమ వివేకము నొసగ గలది,
ప్రేమ కష్టములనుండి గట్టెక్కించగలది మరియు పరివర్తన మొనరించగలది.
అట్టి ప్రేమ మనకు రక్షక వచనము.

(గత సంచిక తరువాయి)

# శ్రీకృష్ణకర్ణామృతం

–సుశీలా ప్రసాద

"వానిని ప్రేమించి సేవించే వారంతా ధన్యులు, ముక్తులు. ద్వేషించేవారు అధోగతిపాలవుతారు. ఇది నాయనా! నేను నీకు చెప్పదలచుకున్న పురాణ కథ. ఇక నేననుకున్న చోటుకి వచ్చేశాను. ఇక నీదారిన నువ్వు వెళ్ళవచ్చు. ఇంతవరకూ నాకు సాయం వచ్చిన పుణ్యఫలితం నీకు దక్కుతుందిలే" అంటూ వృద్ధుడు సవితని వీడ్కొని తనదారిన తాను పోబోతుంటే అంతవరకూ అంతావింటూ ఆలోచిస్తున్న సవిత 'ఆగుతాత!' అని ఏదో అడగబోతుంటే వాని జాడ కనబడలేదు. 'చిత్రంగా మాయమయ్యాడే!' అనుకున్నాడు సవిత.

తను నిలబడి ఉన్న చోట ఎదురుగా చూసేసరికి సవితకి పెద్ద భవనం కనిపించింది. ఇల్లంతా వైభవంగా అలంకరించి ఉంది. ఏదో వేడుక జరుగుతున్నట్లుగా ఉంది చూస్తే. లోనికి వెళ్ళిన సవితని ఎవరూ గమనించినట్లు లేరు. ఆటంక పరచలేదు కూడానూ. వచ్చేపోయే జనాలతో సందడిగా ఉంది. దేదీప్యమానంగా దీపాలు వెలుగుతున్నాయి. ఆ దీపాల వెలుగులలో బాగా అలంకరించుకున్న వనితలంతా దేవతా స్త్రీలవలె కనబడుతున్నారు. వారందరి నడుమ సర్వాభరణభూషితుడై మహాసౌందర్యంతో మెరిసిపోతూ తేజోరాశి అయిన ఒక ముద్దులబాలుని చూస్తూ సవిత కళ్ళు చెదరిపోయాయి. నిలువునాఅలంకరించుకున్న నగల మెరుపులా లేక సహజమైన శరీరకాంతులా! ఆలోచిస్తూ చూస్తున్నాడు సవిత. లేబ్రాయంలో ఉన్న తరుణులంతా పిల్లవాడిని ముద్దుచేస్తూ మార్చిమార్చి తమతమ ఒళ్ళల్లో కూర్చోబెట్టుకుంటున్నారు. అలాగ వారు ఒడిలో పొదుగుతున్నప్పుడు వారంతా తమ గుండెలపై చిత్రించుకున్న మనరికా రత్నాల అందాల నడుమ ఆ బాలుడు రంగురంగుల రంగవల్లికలతో తీర్చిదిద్దిన రత్న పీఠం మీద సుఖాశీనుడై పూజింపబడే వేల్పులా వెలిగిపోతున్నాడు. కళ్ళప్పగించి అలాగే చూస్తుండిపోయిన సవితకి ఎంత సమయం గడిచిపోయిందో తెలియలేదు.

'తండ్రి అయి ఉండి కూడా మీరిలాగ బిడ్డకి మొక్కుతున్నారేమిటండీ?' అన్న పలుకులు వింటూ ప్రస్తుతానికి వచ్చాడు సవిత. అలాగంటున్న నిండైన విగ్రహం తల్లికాబోలు. అంతా వెళ్ళిపోయినట్లున్నారు. పైవాళ్ళెవరూ లేరు. "మన బిడ్డకి పేరుపెట్టిన సమయంలో గర్గాచార్యులవారు 'నీ కొడుకు నారాయణ సమనుడు' అని చెప్పారే. ఇప్పుడు వాడిని కళ్ళ నిండుగా చూస్తూ, నిలువునా వెలిగిపోతున్న వాడిని గమనిస్తుంటే ఆ మాట నిజమనిపిస్తోంది. అందుకే......" తన్మయంగా అంటున్నాడా తండ్రి. "బాగుంది వరస. మీ మాటలు ఎవరైనా వింటే ఎంత ప్రమాదం! అసలే చుట్టూ గండాలు వాడికి కమ్ముకుని

వస్తున్నాయి. ఏ శక్తి రక్షిస్తున్నదోగాని బ్రతికి బయటపడుతున్నాడు." అంటున్నదాతల్లి.

సవితకి వాళ్ళ మాటలు అర్థం కాకుండా ఉన్నాయి. ఇంక తనాతావు నుంచి మరలిపోవాలి అనుకుంటూ సవిత వెళ్ళే ముందు మరోసారి ఆ బాలుణ్ణి చూడాలనిపించి ముందుకు చూశాడు. తల్లి ఒడిలో ఒదిగి ఉన్న ఆ బాలునికి క్షణంలో సగం సమయంలోనే సవితకి నాలుగుభుజాలు, వక్షఃస్థలంపై శ్రీవత్సలాంఛనమూ కొట్టొచ్చినట్లు కనిపించి దిగ్భ్రాంతుడైనాడు. ఇది నిజమా! లేక తను వాని తండ్రి మాటలు విని వైకుంఠనాధుని రూపం కనుగొన్నట్లు భ్రమ చెందాడా!

దినకరుడు నడిమింట వెలుగుతుంటే ముచ్చటగొలిపే పచ్చని చెట్లు నిండిన వనంలో తిరుగాడుతున్నాడు సవిత. తన దైవాన్ని తను ఎలా గుర్తించగలడు? తనకేదిదారి? విచారంగా ఒక చెట్టు మొదట కూలబడ్డాడు. అంతలో ఆవుల అంబారవాలు, పిల్లల కేకలు, అరుపులు వినవచ్చి అందరూ అక్కడికి వచ్చారు. అందులో ఒకడు 'చద్దులు తిన్నాము కనుక కాసేపు యీ చెట్ల కింద మేనువాలుద్దామా?' అన్నడు. ఆ ప్రక్కనే ఉన్న నదిలో నీళ్ళు తాగి, గోవులు కూడా కాసేపు యీ చెట్ల నీడన మాగన్ను పట్టి పడుకున్నాయి. పిల్లలందరిలో మేలుబంతిలా ఉన్న బాలుడు "అన్నా! బలరామా! నీ ఒడిలో తలపెట్టుకుని పడుకుంటాను" అన్నాడు. బలరాముడు ముందుకి జరిగాడు. బాలుడు పడుకున్నాడు. పాటలు, మాటలు, నవ్వులతో మిగిలిన పిల్లలంతా వాని చుట్టూకూర్చున్నారు. సవిత ఆవైపే చూస్తున్నాడు. అంతలో వాని కళ్ళ ఎదుట క్షీరసముద్రంలో శేషశయ్యమీద పవళించి ఉన్న శ్రీమహావిష్ణువును చుట్టూ ఉన్న దేవతలంతా స్తోత్రాలతో గానాలతో వానిని సేవిస్తునట్లు దివ్యమైన దృశ్యం గోచరించింది. తను చూస్తున్నది వాస్తవమా? స్వప్నమా? కళ్ళు మత్తుగా మూతలుపడ్డాయి సవితకి.

తెలివి వచ్చేసరికి నడిమింట తీక్షణంగా వెలుగుతున్న సూర్యుడు నిండు చంద్రుని లాగ చల్లని తన కిరణాలతో మేనిని తాకుతున్నాడు. ఆకాశం నిండా నక్షత్రాల గుంపులు! ఇదేమి చిత్రం! ప్రకృతిలో ఇంత మార్పువచ్చింది!ముందుకి చూస్తే గోవులు పిల్లలు బాలుడు ఎవరూ కనిపించలేదు. ఆ జాడేలేకుండా అంతా మాయమైనారు! గాలికి తలలూపుతున్న తరువులు మాత్రం యధాతథంగా ఉన్నాయి. సవితకి అంతా ఇద్రజాలంలా ఉంది.

ఆవేళలో మళ్ళా కలకలం బయలుదేరింది. ఎందరో స్త్రీలు ఆడుతూ పాడుతూ వచ్చారు. అందరి మధ్యలో లోకాలను తానే ఏలిన అనిపించేటంత వైభవంగా ఠీవిగా ఉన్న, ముందు తనకి కనిపించిన దివ్యబాలుడు వచ్చి తనకి చేరువునే ఉన్న ఒక చెట్టు క్రింద సుఖాసీనుడై అరవిందాలవంటి కరాలతో పట్టుకున్న మురళీ పెదవులపై వుంచి మధురంగా మ్రోగించసాగాడు. సవిత మనస్సులో ఆ పిల్లనగ్రోవి పాట ప్రణవమై,

వేదసారమై మారుమ్రోగసాగింది. ఆ గానానికి సర్వప్రకృతి పరవశించిపోతున్నట్లుంది. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తున్న సవితకి అపూర్వంగా అద్భుతంగా అక్కడ చేరిన మగువలంతా మహర్షులవలె, యోగీశ్వరులవలె దృగ్గోచరం కాగా తృటికాలం మ్రాన్పడి పోయాడు.

సవిత దృష్టికి వారందరి మనోమందిరాలలో అఖండ తేజస్సుతో వెలుగొందుతున్న వైకుంఠవాసి కనిపించాడు. అంతలో అక్కడే వంశీలోలుడై చిన్న బాలుడై దర్శనమిచ్చాడు. తన ఆరాధ్యదైవమైన శ్రీమహావిష్ణువుగా, తనకి వరమిచ్చే వేల్పుగా, బ్రహ్మానందకరంగా కనిపించేసరికి సవిత పరుగునవెళ్ళి స్వామి పావన చరణాలపై వ్రాలిపోయాడు. "ప్రభూ! నీవు ఈ అవనిలో అవతరించిన నీరూపాన్ని నేను కనుగొన్నప్పుడే నాకు మోక్షాన్ని ప్రసాదిస్తాను' అన్నావు. కానీ ఇప్పుడా మెక్షం నాకక్కర్లేదు. వేరే పరమపదమూ అవసరం లేదు. సగుణ బ్రహ్మమైన నీ దివ్యమంగళ విగ్రహాన్ని నిత్యామూ దర్శిస్తూ నీ చెంతనే నిలిచి, నీ లీలన్నీ తనివితీరా చూస్తూ ఆనందజలధిలో ఓలలాడుతూ నన్నిలాగే ఉండిపోనీ చాలు" అన్నాడు సవిత. పరమాత్మ వానివేడికోలును స్వీకరించిన రీతిగా అభయహస్తంతో, చిరునవ్వుతో ఉన్న తన సచ్చిదానంద రూపాన్ని వాని మనోఫలంపై చెరగని ముద్ర వేశాడు.

శ్లో॥తాత్పర్యం –

సొగసైన మనరికా పత్ర రచనలుగల లేబ్రాయపు వన్నెల కుచమధ్యమునగాని, మునుల మనస్సునందుగాని, బృందావనమందలి వృక్షమూలమునందుగాని శ్రీకృష్ణుని రూపం దొరుకుతుందిగాని వానిని సేవింపదగిన చోటు మరొకటి చూడము.

***

## శ్రద్ధాంజలి

శ్రీ బాబూజీ పరమ భక్తులైన భోగరాజు అన్నపూర్ణమ్మ గారు 17-6-2012 ఆదివారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరు ఆశ్రమ స్థాపన నుంచి స్థిరనివాసం ఎర్పరుచుకొన్నారు. గత కొద్ది కాలంగా వీరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరి వయస్సు 76 సం॥ వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు కలరు. వీరు తమ నేత్రములు దానము చేసిన ధన్యజీవులు! సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక. వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సంతాపము తెలియజేస్తున్నాము.

## పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

"చెప్పినట్టు విని, పెట్టింది తిని, చచ్చినట్లు పడిఉండు" అన్న హెచ్చరిక తరుచుగా పెద్దల ద్వారా వింటూ ఉంటాం. అది కొంత మంది మనస్సుని నొప్పించవచ్చు కాని జీవతగమ్యస్థానం చేరటానికి అతి సులువైన మార్గం. వేదాంత పరిభాషలో దీనినే భ్రమర కీటక న్యాయము అని భావన చేయబడుతుంది. చూడటానికి అసహ్యకరంగా కనిపించే ఒక కీటకాన్ని తుమ్మెద తీసుకువచ్చి ఒక ప్రదేశంలో ఉంచి దాని చుట్టూ మట్టితో కప్పి ఉంచి అది ఎటూ కదలటానికి వీలు లేకుండా చేసి దాని చుట్టూ ఝుంకరిస్తూ తిరుగుతుంది. ఆ కీటకం భయంతో ఆనాదంలో లయమై తదాకారాన్ని పొందుతుంది. అలాగే సుద్గరుమూర్తి సాధకులకు బోధ చేసి ఉద్ధరించలేరా! "కాలం వెళ్ళిపోతుంది. వయస్సు మీద పడుతుంది. ఈ క్షణమో మరుక్షణమో ఎవరూ చెప్పలేరు" అనే హెచ్చరిక గాని "కానివి పోనివి కర్మముల్ చేసి కాలుని బారిన పడెద వేలరా" అన్న హెచ్చరికగాని శ్రవణం చేసిన సాధకుడు స్పందించడా? చెప్పుడు మాటలు విని చెడి పోవద్దంటున్నారు. "ఈ క్షణమే నీదనుకో మరు క్షణమే లేదనుకో అని హెచ్చరిస్తున్నారు. భ్రమరంలాగా శ్రవణం చేసిన బోధని ఆచరణలో పెట్టిన సాధకుడు కృతార్థుడు అవ్వడా? అలా చేయనివాడు పునరపి జననం పునరపి మరణం అనే విషవలయంలో చిక్కుకుని వట్టి చేతులతో మట్టిపాలు కాక తప్పదు కదా! అవాంతరలు రావచ్చు వాటిని అధిగమించి అవకాశాలుగా మార్చుకున్న సాధకుడు గురుమూర్తి చేసిన హెచ్చరికను గౌరవించి సత్ఫలితాన్ని పొందక తప్పదు కదా! సద్గురు దేవులు సాధకులను హెచ్చరిస్తూ ఇంద్రియ నిగ్రహం సాధించావా? సాధించగలవా? సాధించటానికి ప్రయత్నిస్తున్నావా? సాధ్యమేనా? అని ప్రశ్నించిన సందర్భంలో శిరస్సువంచి సద్గురు మూర్తి చరణారవిందములను ఆశ్రయించి, అనుసరించి, ఆచరించిన వారికి అసాధ్యమైనది ఉందా! అదే సంపూర్ణ శరణాగతి.

దేహ పోషణకు ఆహారం కావాలి కాని మనస్సుకి బోధ ఆహారం అనే విషయాన్ని విచారణ, మననము, అంతర్మథనము అనే క్రియలద్వారా సాధకుడు శాంతిని ఆనందాన్ని పొందగల్గటమే దానిని ఋజువు చేస్తోందని గ్రహించెదముగాక!

***

# శివానందలహరి

–బులుసు మల్లిక్ **USA**

ఘటోవా మృత్పిండోప్యణురపిచ ధూమోగ్ని రచలః
పటోవా తంతుర్వా పరిహరతి కిం ఘోరశమనమ్
వృథా కంఠక్షోభం వహని తరసా తర్కవచసా
పదాంభోజం శంభోర్భజ పరమసౌఖ్యం వ్రజ సుధీః

శంకరులు మనయొక్క కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నారిక్కడ. ఏది ప్రమాదమో, దానినుంచి ఎలా బయటకుపడాలో మనకి నేర్పుతున్నారీశ్లోకంలో. మనమంతా పరితపించేదే ముముక్షత్వం లభ్యం చేసుకోవాలని. అందులో సందేహం లేదు. దానికి భక్తి, జ్ఞాన, కర్మలు మార్గాలుగా చేసుకొని ఎందరో సాధకులు తమ లక్ష్యాన్ని చేజిక్కించుకున్నారు. అయితే అవే అవరోధాలుగామారి చిక్కుల్లో పడే ప్రమాదం కూడా ఉంది. "తస్మాత్ జాగ్రత జాగ్రత" అని శంకరులు విశదీకరిస్తున్నారు.

కర్మ విషయానికొస్తే, మనం కర్మను చేయకుండా ఉండడమనేది సాధ్యంకానిది. మరి కర్మ ఫలాలు మనకు అంటకుండా ఉండాలంటే ఏదైనా ఉపాయం లేదా? ఉంది. మనంచేసే కర్మలని భగవదర్పణం చేస్తే చాలు. "సత్" యందు న్యాసం చేసిన కర్మలన్నీ "సత్" కే చెందుతాయి. వాటి ఫలాలు కూడా.

ఇకపోతే జ్ఞానం విషయానికొస్తే ఇది సహజంగా చిక్కనిది. మన చేజిక్కినా చిక్కైకూర్చునే ప్రమాదంకూడా ఉంది. ఎంచేతంటే అహంకారం మనలని అథోగతికి లాగుకెళ్ళే సమస్య. రావణాసురుడికి జ్ఞానం లభ్యంకాలేదా? శివతాండవ స్తోత్రంలో "కదానిలింప నిర్ఝరీ నికుంజ కోటరే వసన్ విముక్త దుర్మతిస్సదా శిరస్థమంజలిం వహన్" అని అద్భుతంగా శెలవిస్తాడు. అన్నీ తెలుసు అతడికి. కాని సమయానికి భక్తి లోపించింది.

జ్ఞానమున్న ప్రతిజీవికి తన ప్రపంచం తానిది. తన ఊహ తానిది. క్రమంగా ఇదే తర్కానికి త్రోవతీస్తుంది. దీనికే శంకరులేమంటారంటే "ఘటోవా మృత్పిండోవాప్యణుః" అని. ఘటము లేదా కుండని చూడండి, చూసిన వెంటనే ఏమీ తోచనివాడు దీనిని బహుశా మట్టితో చేసిఉండాలి, కొంచెం తెలివిమీరినవాడైతే దీని రంగుని బట్టి ఇది ఫలానా రకం మట్టి అనో, ఫలానా చోటనుంచి తెచ్చిన మట్టియనో తన లెక్కలు తాను కట్టుకొని డాబులు కొడతాడు. అక్కడతో అగుతాడా అంటే మరి మట్టో, అది అణువులతో తయారైయుండాలి అని తన వాదాన్ని పొడిగిస్తాడు. దీని వల్ల లాభమేదైనా ఉందా? కొంచెం ఆలోచించండి.

ఇంకా శంకరులేమంటున్నారంటే "ధూమోగ్ని రచలః". దూరంగా కొండ ఉన్నది అని ఒకడంటాడు. దానికేసి చూసిన మరొకడు ఏది పొగకనబడుతోంది అదే కదా అని అంటాడు. తప్పకుండా అక్కడ నిప్పు ఉంది. అది ప్రమాదకరమైనది సుమా అని ఊరకే ఏదో కబుర్లు చెబుతాడు. ఈ చర్చకి ఏదైనా ప్రయోజనముందా? మీరే చెప్పండి.

ఇంతేకాదు, మళ్ళీ "పటుర్వా తంతుర్వా" అని మరో ఉదాహరణిస్తున్నారిక్కడ శంకరులు. ఇదిగో వస్త్రము. దీన్ని దారాలతో నేసారు. దారాలని ఫలానరకం ప్రత్తితో తయారుచేసారనో లేక ఫలానరకం పట్టుతో తయారుచేసారనో అంటాడు. దీనివల్ల మనం ఎవరికైనా ఇంచుకంతైనా సహాయపడ్డామా? లేదే. మరి అనవసరమైన చర్చ లెందుకూ అంటారు శంకరులు. ఇవేవైనా మోక్షసాధనకి దోహదపడే సామాగ్రులా? కాదే అని చెబుతూ "పరిహరతి కిం ఘోరశమనం" అంటున్నారు శంకరులు. అంటే కాలయముని శిక్షనుంచి ఇందులో ఏ ఒక్కటైనా మనల్ని గట్టెక్కిస్తుందా. ముమ్మాటికి లేదు.

మరి ఇంకెందుకు "వృథా కంఠక్షోభం వహసి తరసా తర్క వచసా" అని వాపోతున్నారు శంకరులు. అయ్యో, ఆలోచించగలిగిన శక్తి ఉందికదా అని అనవసరమైన చర్చలలో తలదూర్చి అమూల్యమైన నీ కాలాన్ని ఎందుకు దుర్వినియోగ పర్చుకుంటున్నావయ్యా? ఈ తర్కాలవల్ల కంఠం నొప్పెడుతుంది తప్ప ఇంకేదైనా లాభముందా అంటున్నారు.

ముఖ్యంగా నలుగురు చేరి ఎవడికి తోచినట్లు వాడు తన తర్కాన్ని ప్రయోగించేస్తే లేనిపోని గొడవలు, గిల్లికజ్జాలు తప్ప ఏమీ మిగలవు. దీనికే నారదభక్తి సూత్రాలేమంటోందంటే "వాదోనావలంబ్యః" అంటే నాయనా వాదానికి దిగవద్దూ? అది చాలా ప్రమాదకరమైనది. ఎంచేతంటే "బాహుల్యావకాశదనియతత్వాచ్చ" ద్వంద్వంకంటే కడు ప్రమాదకరమైంది బాహుళ్యం. ఒకడొకటంటే వేరేవాడింకొటంటాడు. ఏది నిజమో, ఏది అనిజమో తెలుసుకోలేని అవస్థ. దానిలోనికి పోకుండా జాగ్రత్త పడడమే మన కర్తవ్యం.

ఊరికే ఆలోచించకూడదనడం మంచిదే. మరి మనమింకేమి చెయ్యాలని అంటారా? దానికే శంకరులు "పదాంభోజం శంభోర్భజ పరమసౌఖ్యంవ్రజసుధీః" అంటున్నారు. అంటే నీ ఆలోచించే శక్తిని సద్వినియోగం చేసుకో. ఆ శంభువు పాదపద్మములని గట్టిగా పట్టుకొని భజియించు. పరమమైన సౌఖ్యాన్ని పొందు. మార్గం తప్పకు. ఈశ్వరకృపకు పాత్రునివిగా. శివానందాన్ని లభ్యంచేసుకో. అదే మోక్షానికి నిశ్చయమైన మరియు అతి సులభమైన మార్గము. అదే తారక మంత్రం. మనంకూడా శంకరుల వాక్కులని ఆచరణలో పెట్టే ప్రయత్నంచేద్దాం. ధన్యులమౌదాం.

# మౌన ధ్యాన సప్తాహ శిబిరం

(గత సంచిక తరువాయి) –రమణ ప్రసాద్

శ్రీనాథా గురుమహరాజా! చక్రపాణీ గురుమహరాజా!...

ఈపాట శ్రీగురుదేవుల ముఖస్థగా వచ్చింది. ఒక్కసారి 'ప్రభూ!' అంటే మనస్సు గురుచరణారవిందాల యందు నిలచిపోవాలి. కనుమూసినా, తెరిచినా ఆయన రూపమే మనస్సులో నిలబడాలి. అదే నిజమైన ధ్యానం. ఆర్భాటంగా చేసే ధ్యానం ధ్యానం కాదు. సాధకుడు శ్రద్ధ, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలి. తాబేలు చూడండి! నక్క అలికిడి వినగానే తన అవయవాలను లోపలికి ముడుచు కుంటుంది. నక్క దాన్ని అటూ యిటూ త్రిప్పి 'ఇది రాయి' అనుకొని వెళ్ళిపోతుంది.

మన మనస్సు లక్ష్యార్థంపై స్థిరంగా నిలపాలి. 'శాస్త్రజ్ఞానం ఉంటేనే తరిస్తావు' అని అనలేదు గురుదేవులు. శబరితల్లి ఏం చదివింది? ధ్యానం చేయటం నీ వంతు. ధ్యానంలో మనస్సు నిలిస్తే ధృక్, దృశ్యం, దృష్ట తానే అవుతాడు. ఒకే స్థితిలో ధ్యానానికి కూర్చోవాలి. కదలకుండా కూర్చునే స్థితే ఆసనం. కూర్చోలేని వాళ్ళను గోవిందాసనం అంటే పడుకొనే ధ్యానం చెయ్యవచ్చు.

దృష్టిని ఎక్కడ నిలపాలి? అని సందేహం వస్తుంది. భ్రూమధ్య స్థానంలోగాని, హృదయస్థానంలోగాని దృష్టి నిలపాలి. చూడండి! మన స్వామి మంగళ మూర్తి ధ్యానముద్రలో ఉన్నారు. ఆ విధంగా మనం గురుదేవుని సన్నిధిలో ధ్యానానికి కూర్చోవాలి.

త్రైలింగ స్వామితో చట్టోపాధ్యాయ్ అనే భక్తుడు 'కాళీమాతను చూడాలని ఉంది' అన్నాడు. మహాత్ములు అచేతనాన్ని చేతనంగా మార్చగలరు. అలాగే చేతన వస్తువును అచేతన వస్తువుగా చూపగలరు. త్రైలింగ స్వామి కూర్చున్న గదిపైన అమ్మవారి విగ్రహం ఉంది. చట్టోపాధ్యాయ్ ఆ శిలావిగ్రహంలో త్రైలింగస్వామిని దర్శించాడు. అమ్మవారిలో సజీవంగా త్రైలింగ స్వామిని చూసి, పరుగున క్రిందికి వచ్చి చూస్తే త్రైలింగస్వామి అక్కడ విరాజమానమై ఉన్నారు. ఆశ్చర్యం! త్రైలింగస్వామిలో కాళీమాతను దర్శించాడు. మళ్ళీ పైకి వళ్ళి చూస్తే అక్కడ కాళీమాత విరాజమానమై ఉంది. భగవంతునికి గురువుకి భేదమెక్కడ ఉంది? ఘటనాఘటన సమర్థులు గురుదేవులు. అన్నీ తానే అయి మనకు అనంతమైన అనుభవాన్ని ప్రసాదిస్తున్నారు.

తాళం ఒక్కటే. ఇటు త్రిప్పితే, 'బంధం' అన్నమాట, అటుత్రిప్పితే 'మోక్షం' బంధ రహిత స్థితి. మహాత్ములు ఏమంటున్నారంటే ఉన్న వస్తువును గుర్తించు! దేనిని విమర్శచేయకు. వివేక దృష్టిని అలవరచుకో. చైతన్యాన్ని గుర్తించు. ప్రారబ్ధ కర్మాన్ని అనుభవించాలి. అవి ఆగంతుకాలు. నువ్వు సాక్షివి.

నాభి నుంచి ప్రణవాన్ని నిండుగా పూరించి దేశకాల క్రియలనుదాటి, 'లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తుది అలోకంబగు పెంజీకటికవ్వల నెవ్వండేకాకృతి వెలుగుతూ ఉంటాడో' వాడిని దర్శించాలి. అక్కడ సర్వ సంకల్పాలు ఆగిపోతాయి. అక్కడ నిలబడేది ఏకాకృతిగా వెలిగే చైతన్యమూర్తి అయిన సద్గురుదేవులు.

జ్ఞానం అందరిదీ అయి ఉంది. అది శాశ్వతమై ఉంది. దానిని తెలుసుకోవటానికి ధ్యానం మొదటిమెట్టు. స్వామివారు జపమాల అవసరం అని చెప్పలేదు. జపమాల తిప్పుతున్నవాడి మనస్సు కొలిగిపూస ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంది. భగవద్గీతలో చెప్పినట్లు కర్మలను సన్యసించాలి అంటే వాటి యందు కతృత్వ భక్తృత్వాలు లేకుండా ఉండాలి. ధ్యానంలో చైతన్యాన్ని గుర్తిస్తూ ఉండాలి.

ఏమార్గంలో వెళ్ళాలో తెలియని మనకు గురుదేవులు ఒక లక్ష్యార్థం యిచ్చి మార్గం చూపించారు. కబీర్‌కి వెంటనే లక్ష్యార్థం దొరకలేదు. రామానందులవారి వద్ద దీక్ష తీసుకోవాలనుకున్నాడు. గురువుగారి దైనందిన కార్యక్రమం తెలుసుకున్నాడు. వారికి తెల్లవారుజామున గంగానదికి స్నానానికి వెళ్ళే పరిపాటి ఉందని తెలుసుకున్నాడు. ఆయన వస్తుంటే గంగానది ఘాట్ (రేవు)లో గట్టు మీద పడుకొని ఉన్నాడు. మసక చీకటిలో రామానందులవారి పాదం కబీరు తలను తాకింది. వారు 'రామా!' అన్నారు. కబీర్ వెంటనే లేచి నాకు ఉపదేశమైంది అని సంతోషంగా అన్నాడు. శ్రీరామానందులవారు ఆశీర్వదించారు. కబీర్ దగ్గర బాగా పథ్యం ఉంది. వేరే దృష్టిలేదు. ప్రపంచవాసనలకు చోటులేదు. మనం ప్రపంచవాసలకులోనై పొందవలసినదాన్ని పొందలేక పోతున్నాము. అంతటా రామమయమే. లోపల బయట అంతటా రాముడే విండియున్నాడు అన్నాడు కబీర్. ఇంకా మెలకువలో, నిద్రలో, స్వప్నంలో ఎక్కడ చూసినా ఆ రాముడే నిండియున్నాడు అని చెప్పి కబీర్ మనలను కూడా ఆస్థితిని పొందమని ఆశీర్వదించాడు.

గురుదేవులను నిత్యం స్మరించాలి. వారి ఆజ్ఞను పాటించాలి. 'గుండుసూది మింగరాదు, గురు ఆజ్ఞను మీరరాదు' అని నానుడి. గురుదేవుల ఆశ్రయంలో మన జీవితాలను పునీతం చేసుకుని గురుకృపకు పాత్రులమవుదాం!!

*

తనకు తానుగానే దేవుడు నీచే ఏ కర్మను జేయించునో దానినే చేయుము. అయితే ఆ కర్మ యందు గాని, దాని ఫలమునందు గాని నిరాసక్తుడవై యుండుము.

# తోడు - నీడ

–సుశీలా ప్రసాద

స్టేషన్‌లో బండి ఆగింది. రైలు దిగింది యిద్దరో ముగ్గురో. అక్కడికి ఒక మైలు దూరంలో ఉంది ఒక చిన్న ఊరు. ప్రయాణ వసతిలేని ఆ ఊరికి యీ రైలే ఆధారం. రైల్లోంచి దిగిన యిద్దరు స్త్రీలు పెట్టెలు చేత్తో పట్టుకుని స్టేషన్ బయటకి వచ్చారు. స్టేషన్‌కి ఊరికి మధ్యలో పంటచేలు ఉన్నాయి. అవి బాగా ఎదిగి ఉన్నాయి. వాటి మధ్యలో కాలిబాట ఉంది. బండి ఆలశ్యం అయింది కను చీకటి పడబోతోంది. ఆడవాళ్ళిద్దరూ బిక్కు బిక్కుమంటూ కాలిదోవలో నడక సాగించారు.

వారు అటూ యిటూ చూసే సరికి తమ వెనకే కొంచెం దూరంలో వస్తున్న ఒక పురుషుడు కనిపించాడు. తమకి తోడున్నాడులే ఒకడు అనుకునే లోపలే వాళ్ళకి అతగాడి అకారాం కొంచెం భయం కలిగించింది. తాము చేరబోతున్న ఊరిలో ఎంతో మహత్తు గలవాడని పేరుమోసిన దేవుని గుళ్ళో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. అవి చూడాలని, వాటిలో పాల్గొనాలనీ ఆసక్తితో భక్తితో వాళ్ళిద్దరూ పయనిస్తుంటే, ఆ వ్యక్తి ఎవరో తమను వెంటాడుతున్నట్లు తోచి, అయినా తాము నమ్మిన దైవం తమను తప్పక రక్షిస్తాడనే గాఢమైన విశ్వాసంతో భగవన్నామ స్మరణ చేసుకుంటూ వాళ్ళు నడవసాగారు. వారి చేతిలో ఉన్న పెట్టెలలో వారు కష్టపడి సంపాదించుకున్న పైకం, తాము ధరించేందుకు తమకున్న నాలుగు చీరలు ఉన్నాయి.

నిజం చెప్పాలంటే వారి వెనుకే వస్తున్న మగవాడు చేవాటుతనంతో బ్రతికే దొంగవాడే. రైల్లో వస్తున్నప్పట్నించీ ఆ స్త్రీలిద్దరినీ చూస్తూ వారి ఒంటి మీద బంగారం ఏదో స్వల్పంగా ఉన్నట్లు గమనించి, వారి పెట్టెలో రొక్కమేదో ఉండి ఉంటుందని ఊహించి, వెంటపడ్డాడు. నిర్మానుష్యంగా ఉన్న ఆ కాలిదోవలో వారిని దోచుకుని పారిపోతే నాలుగురోజులు తనకి గడిచిపోతుందని వాడి ఆలోచన.

ఆలాటి వేళ త్వరగా నడచి వారిని చేరాలని ఆరాటంతో ముందుకి అడుగు వెయ్యబోతుంటే, ఎవరో వాడి చేతిని పట్టుకుని లాగినట్లనిపించింది. వెను తిరిగి చూశాడు. ఐదారేళ్ళ బాలుడు గట్టిగా వాని చెయ్యి పట్టుకొని "నాకు భయం వేస్తోంది. నన్నూ నీతో తీసుకెడతావా?" అని ముద్దు ముద్దుగా అడిగాడు. దొంగ కఠినంగా "ఎవరు నువ్వు?" అని అడిగాడు. "నేను నేనే!" అన్నాడా

బాలుడు బుంగమూతి పెట్టి. “మీ వాళ్ళెవరూ నీతో రాలేదా?” అన్నాడు మళ్ళీ కటువుగా దొంగాడు. “మా వాళ్ళు ముందే వెళ్ళిపోయారు. నేనొక్కడినే వస్తున్నాను” అన్నాడు ఆ బాలుడు కొంచెం దీనంగా ముఖం పెట్టి.

ఈ సంభాషణ జరిగేటంతలో ఆ స్త్రీలు చాలా ముందుకెళ్ళిపోయారు. ‘అరెరే!’ అనుకుంటూ ఆ దొంగ చేతిని విదిలించుకుంటూ “నీ గోల నాకెందుకు? నీ దారిని నువ్వు పో!” అంటూ చకచకా నడవబోయేటంతలో మళ్ళీ వాని చేతిని గట్టిగా పట్టుకుంటూ ఆ బాలుడు “ఇలాగ వదిలేస్తే ఎలా? నేనూ నీతోనే వస్తాను” అన్నాడు పట్టుదలగా. ‘నా ప్రాణానికి వీడెక్కడ పోగయ్యాడా!’ అనుకుంటూ ఆ దొంగ “నాతో నువ్వు నడవలేవు. నేను ముందుకి పోతాను. నా చేతిని వదులు” అన్నాడు దొంగ.

బాలుడు చిరునవ్వుతో “నన్ను కాదని నువ్వు ముందుకి ఎలాగ పోతావు? నేను నీ వెనకే పరుగెత్తి వస్తాను. ఎవరు ముందు పోతామో పందెమేనా?” అన్నాడు. దొంగ దిగాలుగా దారివంక చూశాడు. ఆడవాళ్ళిద్దరూ పెట్టెలు నెత్తిన పెట్టుకుని త్వర త్వరగా నడిచి పోతున్నారు. దొంగకి విసుగొచ్చింది. “చూడు పిల్లాడా! ఆ ముందుపోతున్న ఆడవాళ్ళు పాపం బరువు మోస్తూ ఎలాగ కష్టపడి వెడుతున్నారో! నేను ముందుకెళ్ళి వాళ్ళకి సాయం చేస్తాను. నువ్వు మెల్లిగా రా!” అన్నాడు. “ఇంకేం! నువ్వు చేద్దామనుకున్నది మంచిపనేగా! అందుకని నువ్వు నేను త్వరగా వెళదాం పద” అన్నాడు బాలుడు. హతాశుడై దొంగ ‘వీడు వదిలేట్టులేడు’ అనుకుంటూ నడిచి వెళ్ళి ఆ స్త్రీలను కలుసుకున్నాడు. దగ్గరకి వెళ్ళగానే ఆ బాలుడు “నువ్వేదోసాయం చేస్తాను అన్నావే! మరి కానీ!” అని హెచ్చరించాడు. బాలుని మాటలు వింటూ ఆశ్చర్యంగా చూశారా స్త్రీలు.

దొంగ వెంటనే ఎంతో మర్యాదగా “అమ్మా! ఆ పెట్టెలు నేను తెస్తాను. మీరెక్కడికి వెళ్ళాలో చెప్పండి. మీతో కూడా సాయంగా వస్తాను” అన్నాడు. తానిలాగ మాట్లాడినందుకు దొంగకు మనస్సులో ఏదో వింతగా అనిపించింది, తనేనా అలాగ మాట్లాడిందని. బాలుని వంక చూశాడు. ఆడవాళ్ళు కూడా చూశారు పిల్లాడి వంక. ఆ పసివాని కళ్ళల్లో ఏదో వెలుగు, ఎంతో ప్రేమ, మరింత ఆప్యాయత కనిపించాయి వారికి. భయపడుతూనే పెట్టెలు దొంగకిచ్చినా ఆ స్త్రీల యిద్దరి మనస్సులో ఆ బాలుని చూస్తూంటే ఎంతో ధైర్యంగా అనిపించింది.

ఇక దొంగ సంగతి ఏమిటంటే వాడి మనస్సులోనుంచి దొంగతనం

చేయాలనే దుశ్చింత తొలగిపోయింది. ఆ చిన్నవానితో నడిచి వచ్చినందుకు, కలిగిన మార్పు కాబోలు ఇది! వారిని గమ్యానికి చేర్చిన తరువాత దొంగ చేతులు జోడించి, "అమ్మల్లారా! నిజంగా నేను దొంగను. మీ పెట్టెలు ఎత్తుకు పోవాలని నా ఆలోచన. కాని యీ పసిపిల్లవాడు నన్ను మార్చేశాడు. ఇంతకు ముందు చేసింది చాలు. ఇకముందు కూడా నేనా దోవను పోను. మీ దారినే వస్తాను. నన్ను మీ మంచిదారిలో రానివ్వండి" అన్నాడు పశ్చాత్తాప పడుతు. ఆ ఆడవాళ్ళిద్దరూ విస్తుపోయారు. వానిలో యింత స్వల్పకాలంలో యింత మార్పు తెచ్చిన ఆ పసివానిని ప్రేమగా అక్కున చేర్చుకోవాలని ముగ్గురూ చుట్టూ చూశారు. ఆ చిన్నవాని జాడ లేదు. ఎటు వెళ్ళాడు? ఏమో!!

భక్తిగా నమ్మిన ఆ స్త్రీలకి ఏ కష్టం కలగకుండా తోడుగా నిలిచి, దొంగను నీడగా వెన్నంటి, వాని మనస్సుమార్చిన ఆ ఆపద్బాంధవుడు తన వునికిని చెప్పకనే చెప్పినట్లు గుడిగంటలు గణగణ మ్రోగాయి అప్పుడే. కోవెల వేపు తిరిగి తలవంచి నమస్కరించారు ఆ ముగ్గురూ!

*

## రెండు పక్షులు

బాహ్యదృష్టి అంతరదృష్టిగా మార్చుకొన్నచో సర్వేశ్వరుడు లభిస్తాడు. లేకపోతే ప్రపంచంలో కష్టాలు తప్పవు. దీనికుదాహరణె ఈ కథ.

వృక్షశాఖల మీద రెండు పక్షులు కూర్చుని ఉన్నాయి. పైకొమ్మమీద వున్న పక్షి ఆనందంగా, శాంతంగా, నిశ్శబ్దంగా వున్నది. రెండవ పిట్ట పండ్లుకోసం ఈ కొమ్మ నుంచి ఆ కొమ్మకు ఎగురుతూ తీయని పళ్ళు దొరికితే సంతోషిస్తూ, చేదు పళ్ళు దొరికితే దుఃఖిస్తూ వున్నది. తాత్కాలికానందంకోసం అది తిరుగుతూ, చివరకు విసిగి ప్రశాంతత కోసం తపించింది. పై కొమ్మ మీద చిదానందంలో వున్న పక్షిని చూచింది. అంతే పై కొమ్మనున్న పక్షి మిగిలి రెండవది మాయమైంది. క్రింది పక్షి పైనున్న దానిలో ఐక్యమయ్యింది.

- స్వామి రామదాసు చెప్పిన కథ

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గతసంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

తరువాత ఒకసారి ఈ సంఘటనను గూర్చిన ప్రస్తావన వచ్చినప్పుడు శ్రీబాబు రమణబాబుతో "నాన్నగారికి యిలా జరుగుతుందనే సంకేతం నాకు జగన్మాత ఆరునెలల ముందే అందించింది. మరికొంతకాలం ఆయుర్దాయాన్ని పెంచమని అమ్మను ప్రార్థించాను. కాని అమ్మ 'ఆయన సమయం అయిపోయింది' అని చెప్పింది" అని శ్రీబాబు చెప్పారు.



పరశురామయ్యగారు, వారి శిష్యులు గూడూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు (శ్రీబాబు వారిని 'అన్నగారు' అనేవారు.) శ్రీబాబు కోసం ఒక ఆశ్రమం ఏర్పాటు చేయాలని, వారి దివ్యబోధలు లోకానికి అందేందుకు ఆ ఆశ్రమం కేంద్రం కావాలని చాలా ప్రయత్నించారు.

శ్రీమావులేటి చిరంజీవిరాజుగారు, డా॥లంకా శేషగిరిరావుగారు , జయపూర్ రాజా విక్రమదేవ వర్మగారు కూడా ఆ విషయంలో తీవ్ర ప్రయత్నం చేసారు. కాని శ్రీబాబు అప్పట్లో ఆశ్రమం ఏర్పాట్ల పట్ల పూర్తిగా నిరాసక్తులై "నాకు ఆశ్రమం కావాలనే కోరిక లేదు. పదిమందికి వెల్లడి కావాలనే కోరిక అంతకంటే లేదు. జగన్మాత సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది" అన్నారు.

ఆ మహనీయులందరి సత్సంకల్పం ఫలితంగానే 1972లో శ్రీకాళీ వనాశ్రమము రూపుదిద్దుకొంది. అప్పటికి శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారు మాత్రం సజీవులై వున్నారు. తమ చిరకాల ఆశయం నెరవేరినందుకు బ్రహ్మానందం పొందారు. వారు కుటుంబ సహితులై ఆశ్రమంలోనే ఉండి తమ చరమ జీవితాన్ని చరితార్థం చేసుకున్నారు.

పరశురామయ్యగారి బ్రహ్మైక్యానంతరం శ్రీబాబు యనమదుర్రు చాలా అరుదుగా అప్పుడప్పుడు వెళ్ళేవారు తరువాత పండుదొరగారు, కొండలరావుగారు మొదలైన భక్తులు శ్రీబాబు పూజలు జరిపే చోట్లకు అరుదుగా వెళ్ళేవారు. ఆశ్రమానికి కూడా వచ్చారు. శ్రీబాబు వారిని ప్రేమతో ఆదరించారు. యనమదుర్రు గ్రామం ఇప్పుడు శ్రీబాబు జ్ఞాపకాలతో మిగిలిపోయింది.

* *








ది. 18.06.2012 న యోగినీ శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబల్ ట్రస్ట్, శ్రీ కాళీ వనాశ్రమం, నంబూరు వారిచే పెదనింద్రకొలను,దేవర గోపవరం, భువనపల్లి గ్రామాలలోని పాఠశాలలో ఉచిత పుస్తక వితరణ దృశ్యాలు.

# ఆధారం లేని సిద్ధాంతం

డా.మల్లిప్రియ 'నాగరాజు'

సృష్టి ఆరంభంనుండి నేటివరకు భగవన్నామంపై ప్రజలలో ప్రబలియున్న అపోహలను పటాపంచలు చేస్తూ, గుంటూరు శ్రీ ఓంకారక్షేత్రంలో జరిగిన సత్సంగ సమావేశంలో సమర్థ సద్గురు శ్రీ హనుమత్కాళీ వరప్రసాదబాబు ఇలా అన్నారు.

భగవన్నామం మిక్కిలి తియ్యనైనది. శాస్త్రాల ద్వారా పొందే అనుభూతికన్నా ఆత్మానుభూతి ఎంతో గొప్పది. 'రామ' అనే రెండక్షరాల మీద మనస్సు నిలిపి ఆ నామంలో మనం లీనమై పోవాలి. భగవన్నామం చాలా నియమ నిష్ఠలతో చేయాలని, ఎప్పుడుపడితే అప్పుడు చెయ్యకూడదని కొందరు చేసే వాదం నిరాధారం.

భగవన్నామానికి ఏ నియమాలూ లేవు. శబరి ఎంగిలి పండ్లను శ్రీరామునికి పెట్టింది. ఆమె దృష్టిలో తనకూ రామునికి భేధమే లేదు. తిన్నడు ఈశ్వరునికి మాంసాన్ని నైవేద్యంగా అర్పిస్తే ఈశ్వరుడు భుజించాడు. కలకండ వేరుగాను, నీటిగ్లాసు వేరుగాను ఉన్నంతవరకూ అవి భిన్న స్వరూపాలు కావచ్చు. కానీ, కలకండను నీటిగ్లాసులో వేస్తే మిగిలేది తియ్యటి పానకం ఒక్కటే. కలకండా ఉండదు, నీరూ ఉండదు. పానకం అయిపోతుంది. భగవంతునితో కలిసాక మనమూ అదే విధంగా మన నామ రూపాలను గోల్పోతాం. పౌర్ణమి వచ్చాక ఇక అమావాస్య చీకటి ఎక్కడిది? ఒక్కసారి జ్ఞాననేత్రం తెరవండి. భగవన్నామానికి నియమాలు ఎందుకు?

అసలు మనం జీవించేది ఎన్నాళ్ళు? "బావా, నీవెప్పుడు మరణిస్తావు? నే నెప్పుడు మరణిస్తాను" అని అర్జునుడు అడిగితే శ్రీ కృష్ణ పరమాత్మ "అర్జునా, శ్వాసవదిలి తిరిగి పీల్చేలోపలే మానవ దేహం పోవచ్చు కనుక నిరంతరం నన్ను ప్రార్థించు" అన్నారు. అలాగే బుద్ధ భగవానుడు జీవితాన్ని నీటి బుడగతో పోల్చాడు. నీటి బుడగ ఉన్నంతసేపు కూడా జీవితం ఉండకపోవచ్చు.

భగవన్నామానికి నియమాలు లేవు అనటానికి శ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబూజీ తమ జీవితంలో ఒక విచిత్ర సంఘటన గుర్చి ఇలా వివరించారు.

"అప్పుడు నాకు 12 ఏండ్లు. ఆధ్యాత్మికమైన కొన్ని సందేహాలు నివృత్తి చేసుకొందామని కోనసీమలోని ఒక మహా పండితునివద్దకు వెళ్ళాను. ఆయన భగవన్నామానికి నియమ నిష్టలు అవసరమని, ఎప్పుడు పడితే అప్పుడు భగవన్నామం ఉచ్ఛరించడం పాపమని అన్నాడు.

ఆరోజు మధ్యాహ్నం పనసకాయ కూర, పప్పు, ఆవకాయ, పెరుగుతో భోజనం

పెట్టారు. భోజనం కాగానే ఆ పండితునికి విరేచనాలు ప్రారంభమై ప్రాణం పోతుందేమో ననిపించింది. ఒక అరుగు మీద కూర్చుని 'కృష్ణా', 'గోవిందా', 'నారాయణా' అని పెద్దగా అరవసాగాడు.

"స్వామీ, మరి విరేచనాలు అవుతున్నప్పుడు 'నారాయణ' అంటున్నారేం? అది తప్పుకాదా?" అన్నాను నేను.

ఆ తర్వాత వైద్యు డిచ్చిన శొంఠి, వగైరాలు కలసిన మాత్రలను ఆయనకిస్తూ "ఈ మాత్రలు 'కృష్ణా', 'రామా' అనుకుంటూ వేసుకోండి. మీ జబ్బు తగ్గుతుంది" అన్నాను. కొంత సేపటికి ఆయన కుదుట పడ్డాడు. నామోచ్ఛరణకు నియమాలు లేవని అంగీకరించాడు. అందుకే శ్వాస వదలి పీల్చే లోపలే ప్రాణి పోవచ్చని, నిరంతరం తనను భజించమని శ్రీకృష్ణుడు చెప్పడం జరిగింది.

ఒక స్త్రీ ప్రసవ వేదన భరించలేక 'కృష్ణా' 'వాసుదేవా' అని అరుస్తుంది. అది పురిటి సమయమని, మలినమైన స్థలమని ఆమెను 'కృష్ణా' అనవద్దని శాసించడం అవివేకం. 'కృష్ణా', 'వాసుదేవా' అనుకోవడంవల్ల సుఖప్రసవమై కృష్ణుని వంటి బిడ్డ జన్మిస్తాడు.

బహిష్టులో ఉన్న స్త్రీ శారీరక రుగ్మతతో 'రామా', 'కృష్ణా' అని అరిస్తే తప్పని శాసించడానికి మన మెవ్వరం? భగవన్నామం ఏ పని చేస్తూ అయినా జపించండి. కొన్నాళ్ళకు అదే జపమై, మీ జీవితంలో భాగమై మిమ్మల్ని పరమాత్మ సన్నిధికి చేరుస్తుంది.

వేప పసరులో వేసిన శనగ గింజ చేదుగా ఉంటుంది. పంచదార పానకంలో వేసిన శనగ గింజ తియ్యగా ఉంటుంది. వ్యర్థ జీవితమే వేప పసరులో వేసిన గింజ. భగవన్నామంతో కూడిందే సార్థకమైన పానకంలో వేసిన శెనగ గింజ, అని గ్రహించండి.

దేనికైనా అంతఃకరణ ముఖ్యం, సన్యసించ వలసింది మనసుగాని, వేషం కాదు. కబీర్ శిష్యులొకరు కుష్ఠురోగిచేత మూడుసార్లు రామనామ జపం చేయించి నదిలో ముంచగానే వ్యాధి పోయిందట. అది తెలిసిన కబీర్ "ఓరీ మూర్ఖుడా ఒక్కసారి రామనామం జపిస్తేనే చాలురా వ్యాధి పోతుంది! మూడు సార్లు ఎందుకు? అని చెప్పాడట చూశారా! నామం ఎంత గొప్పదో!"

***

నిరంతరముగా మంత్ర ఉచ్చరణ మొనరించుము. అది శాశ్వత శాంతికి బీజప్రాయము

(గత సంచిక తరువాయి)

# అపరోక్షానుభూతి

-పరాశర ప్రసాద్

జగత్తును గురించి విచారణ చేయాలి. జగత్తు ఎలా జనించింది? జగత్తు అజ్ఞానం వలన జనించింది. జగత్తు అనే సినిమా అజ్ఞానం అనే చీకటిలో మాత్రమే కనబడుతుంది అని గ్రహించాలి. అజ్ఞానం రహితం అయితే జగత్తు లేదు. ప్రకాశం అనే జ్ఞానం కల్గితే ప్రపంచం అనే సినిమా కన్పడదు. సినిమా హాల్లో లైట్లు వేయగానే సినిమా అదృశ్యమయినట్లు జ్ఞాన తేజస్సులో అజ్ఞానం లయమవుతుంది. జ్ఞాన అభావమే అజ్ఞానము. జగత్తుకి కర్త ఎవరు? అనేది విచారణ చేస్తే సంకల్పమే కర్త అని తెలుస్తుంది. జగత్తుకి ఉపాదానము ఎవరు? అని విచారణ చేయాలి. వస్తువు యొక్క సృష్టి, స్థితి, లయలకు ఏది ఆధారమో అదే ఉపాదానము అని పిలువ బడుతుంది. కుండకి మట్టి ఉపాదానము. ఒక వస్తువు తయారు చేయటానికి అవస్యమైన పదార్ధము ఉపాదాన కారకము. అ వస్తువుని తయారు చేయువాడు నిమిత్తకారకము. దానిని తయారు చేయటానికి అవస్యమైన పరికరాలు సహకారకము. కుండ తయారు చేయటానికి మట్టి ఉపాదానకారకము. కుమ్మరివాడు నిమిత్త కారకము. చక్రము మొదలైనవి సహకారకములు. కాని జగత్తు సృష్టింపబడటానికి ఉపాదాన నిమిత్త కారకములు రెండు "నేనే". సాలె పురుగు దాని నోటి నుంచి వచ్చిన పదార్ధముతో సాలెగూడు తయారు చేస్తుంది. సాలెగూడు నిర్మింప బడాలంటే ఉపాదాన నిమిత్త కారకములు రెండూ సాలె పురుగే. జగత్తుకి భగవంతుని మాయ నిమిత్త కారణం. చైతన్యం ఉపాదాన సహకారణం అయింది. పరబ్రహ్మ వస్తువు ఈ జగత్తుకి పరిణామ ఉపాదానం. బంగారం మారి అభరణం అయింది. మట్టి మారి కుండ అయింది. కాని జగత్తులో పరబ్రహ్మం తాను తానుగానే ఉండి జగత్తుగా భాసిస్తోంది. కాబట్టి వివర్తోపాదానం.

సంధ్య చీకటిలో పొలంనుంచి వస్తున్న రైతు త్రాడును చూసి పాము అనుకొన్నాడు. త్రాడు త్రాడు గానే ఉన్నా సర్పముగా భ్రమించాడు. జగత్తులో ఉన్నది బ్రహ్మమే. అంతా బ్రహ్మమే అయినపుడు నీవు ఎవరవు? నీవు కూడా జగత్తులో వాడివే కదా! నీవు కూడా బ్రహ్మమే. గురువాక్యము నందు శ్రద్ధ, విశ్వాసము ఉన్న సాధకుడు తాను బ్రహ్మమని అనుభూతి పొందుతాడు.

సద్గురుమూర్తి ప్రత్యక్ష దైవము. శిష్యుడిని నీవు బ్రహ్మమే అని చెపుతాడు. పరిపూర్ణ విశ్వాసం ఉన్న శిష్యుడు నేను బ్రహ్మను అనే జ్ఞానాన్ని కల్గి ఉంటాడు. విశ్వాసం లేని వాడు భ్రమలో ఉంటాడు. అనుభవజ్ఞానం కావాలి. అది ఉన్నవాడు నేను బ్రహ్మను అని ఎన్నడూ చెప్పుకోడు. దాని అనుభూతిని పొందుతాడు. అతని హృదయం ప్రేమతో నిండి ఉంటుంది. గురుదేవుని యందు పరిపూర్ణ విశ్వాసం, భక్తి కల్గి ఉన్న సాధకుని హృదయం ప్రేమతో నిండి ఉంటుంది. అపరోక్షానుభూతిని పొందటానికి అదియే సరియైన మార్గము. హృదయం కఠినంగా ఉండి ప్రేమ లేని సాధకుడు అపరోక్షానుభూతిని పొందటం అసంభవం.

– సశేషం

## మహాత్ముల స్వభావం

భక్తుడొకడు జీవనోపాధికి బట్టలు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. బట్టలు చాలా కుట్టించి అమ్మే వ్యాపారి, ఇతనితో బట్టలు కుట్టించుకుని కూలిగా చెల్లని నాణాలు ఇచ్చి వెళ్ళుతూ ఉండేవాడు. అవి చెల్లనివని తెలిసి కూడా ఆ దర్జీ మారు మాటాడకుండా తీసుకునేవాడు. ఒకసారి పనివాడికి కొట్టు అప్పజెప్పి ఆ మహాత్ముడు ఏదో పని మీద బయటికి వెళ్ళాడు. మామూలుగా చెల్లని నాణాలు ఇచ్చే ఆసామి వచ్చి అభిమానము నటిస్తూ చెల్లని నాణాలు కూలిగా ఇచ్చాడు. సేవకుడు వాటిని చూచి ఇవి చెల్లవు వేరేవి ఈయండి అన్నాడు.

సేవకుడు యజమాని రాగానే "అయ్యా మీరు లేనప్పుడు పట్టణం నుంచి వచ్చిన పెద్దమనిషి చెల్లని డబ్బు ఇచ్చి మోసగించాలనుకున్నాడు" అన్నాడు. "వాటిని ఎందుకు తీసుకోలేదు? అతనెప్పుడూ నాకు ఇలాంటి పడని వాటినే ఇస్తున్నాడు. నేను వాటిని తీసుకొని గొయ్యి తీసి కప్పెడుతున్నాను. నేను వాటిని తీసుకోకపోతే వేరే వాళ్ళకి ఇచ్చి మోసం చేస్తాడు" అన్నాడు ఆ మహానుభావుడు.

- స్వామి రామదాసు చెప్పిన కథ

# శ్రీ శుకబ్రహ్మాశ్రమము - రచనలకు ఆహ్వానము

## పూజ్యశ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి
## శత జయంతి స్మారిక (విశేష సంచిక)

2013 సంవత్సర ఏప్రిల్ నెలలో విజయనామ సంవత్సరము, చైత్రమాసంలో జరుగనున్న పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పూజ్యశ్రీ స్వాములవారిని గురించి ఒక విశేష సంచికను (శతజయంతి స్మారికను) ప్రచురించాలని తలంచినాము. సంచిక ఈ క్రింది విషయాలపై రచనలతో ఉండాలి. వ్రాతలో పది పేజీలు మించరాదు.

1. పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పర్యటనలో భక్తుల అనుభవాలు.
2. పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గీతాజ్ఞాన యజ్ఞాలు - శ్రోతలపై ప్రభావము
3. గీతామకరంద ప్రాశస్త్యము
4. శ్రీ స్వాములవారి ఇతర రచనల ప్రాశస్త్యము
5. టి.టి.డి. తో అనుబంధము
6. శ్రీ మళయాళస్వాములవారి ఆశయాలను శ్రీ స్వాములవారు సఫలం చేసిన విధానము
7. శ్రీ స్వాములవారి సామాజిక సేవ
8. శ్రీ కాళహస్తి క్షేత్రములో శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపనము
9. శ్రీ స్వాములవారు స్థాపించిన భక్త కన్నప్ప ఉచిత కంటి ఆసుపత్రి విశిష్టత - సేవ
10. శ్రీ స్వాములవారు శ్రీకాళహస్తిలో విరాళమిచ్చి తన పేరుతో ప్రారంభింపజేసి నడుస్తున్న ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థుల అనుభవాలు - భావాలు శ్రీ స్వాములవారిని గురించి.

ఈ పై విషయాలపై రచయితల నుండి వ్యాసాలు స్వాగతింపబడుచున్నవి. పై విషయాలతో పరిచయముగల రచయితలు తమ తమ వ్యాసాలను 31-8-2012 లోపల మాకు చేరునట్లు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము శతజయంతి సంచిక విభాగము, స్వామి విద్యా ప్రకాశానంద నగర్, శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు), శ్రీ కాళహస్తి, చిత్తూరు జిల్లా, అం.ప్ర-517640 అను చిరునామాకు పంపగోరుచున్నాము.

శ్రీ కాళహస్తి — ఇట్లు: కార్యదర్శి

తేది: 10-5-2012 — శతజయంతి ఉత్సవ సంఘం

# కోపాన్ని జయించటం ఎలా?

– జగం

ఈ సృష్టిలోని 84లక్షల జీవరాసులలోనూ మానవజన్మ ఉత్తమమైనది. ఇది అతి దుర్లభమైనది కూడాను. ఎన్నో జన్మల పుణ్యం రాశీభూతమైతేగాని యీ మానవ జన్మ లభించదు అంటారు మహాత్ములు.

ఇటువంటి మానవజన్మకు ప్రధానమైన శత్రువులు ఆరు. అవి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. ఈ అన్నిటిలోనూ మహా వికృతమైనది క్రోధం. ఇటువంటి కోపాన్ని జయించటం ఎలా?

వడ్లగింజ నాటితే మొలకెత్తుతుంది. అంటే పునర్జన్మను పొందుతుంది. కాని, పైనున్న రెండు పొరలను తొలగిస్తే అది తిరిగి మొలకెత్తదు. అంటే తిరిగి జన్మ ఉండదు. అలాగే, క్రోధం మొలకెత్తకుండా ఉండాలంటే, అహంకారం, మమకారం అనే రెండు పొరలను మనస్సులో నుంచి తొలగించాలి. 'నేను' అనుకోవటం అహంకారం, 'నాది' అనుకోవటం మమకారం. ఇచ్ఛాశక్తి (WILL POWER)ఉంటే ఈ రెండిటినీ తొలగించటం చాలా తేలిక. అది లేకపోతే చాలా కష్టం. కోపాన్ని తొలగించటం కష్టమేమీ కాదు. చాలా తేలిక. 'తొలగించాలి' అని అనుకోకపోవడమే కష్టం. 'నేను' శాశ్వతం కాదు. మరి 'నాది' శాశ్వతమా? 'నేను' లేనప్పుడు, 'నాది' ఎక్కడిది?

కోపాన్ని జయించటం ఎంత తేలికో బుద్ధుని జీవితంలో జరిగిన ఒక సంఘటన ఋజువు చేస్తుంది. బుద్ధుడు సన్యాసం స్వీకరించాడు. సన్యాస ధర్మ ప్రకారం ఆరోజు భుక్తికి సరిపడ మాత్రమే యాచించాలి. ధర్మ ప్రకారం బుద్ధుడు ఒకరోజున యాచనకై ఒక యింటికి వెళ్ళాడు. "మాతా భిక్షాం దేహి," అన్నాడు. ఆ యింటి యిల్లాలు భిక్షతో బయటకు వచ్చింది. బుద్ధుణ్ణి పైనుండి క్రిందకు పరీక్షగా చూసింది. యువకుడు, అంగవైకల్యం లేదు. 'ఇటువంటివాడికి భిక్షవెయ్యటమెందుకు,' అనుకొంది. కాని అతడు సన్యాసి, యాచించటం సన్యాస ధర్మం అని ఆమెకు తెలియదు. అందుచేత ఆమెకు కోపం వచ్చింది.

"నీకు కాలు, చెయ్యి బాగానే ఉన్నాయి! పనిచేయలేని ముసలివాడివి కాదుకదా. పనిచేసుకుని బ్రతకకుండా యీ అడుక్కోవటం ఏమిటి," అని కోపంగా అన్నది.

అతడి నుంచి ఎటువంటి సమాధానమూ లేదు.

ఆమె కోపం పెరిగింది.

"నేను అడుగుతుంటే మాట్లాడవేమిటి?"

అయినా సమాధానం లేదు.

"నువ్వు మనిషివా? లేక రాతి బొమ్మవా? అడిగిన దానికి సమాధానం చెప్పాలని తెలియదా?"

అయినా బుద్ధునిలో ఎటువంటి చలనమూ లేదు.

"నీకు సిగ్గూ, శరమూ లేవా? శరీరంలో చీమూ నెత్తురూ లేవా? అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా? ఇంతగా తిడుతున్నా దున్నపోతు మీద వాన పడ్డట్టుగా నీలో చలనం లేదే," అని తారాస్థాయిలో కోపంతో తిట్టింది.

అప్పుడు బుద్ధుడు నోరు తెరిచాడు.

"అమ్మా! మీరు చెప్పడం అయిపోతే నేనొకటి చెబుతాను", అని ప్రశాంతంగా అన్నాడు.

"చెప్పు" అన్నది విసుగ్గా.

"మీరు నాకు వెయ్యడానికి భిక్ష తీసుకుని వచ్చారు. అది నాకు వెయ్యబోయారు అనుకోండి. ఆ భిక్షను నేను స్వీకరించడానికి నిరాకరించాను అనుకోండి. అప్పుడు అది ఎవరికి చెందుతుంది?"

"ఇందులో ఏముంది? నాకే చెందుతుంది," అన్నది ఆమె.

"అలాగే మీ తిట్లు కూడా," అని బుద్ధుడు సౌమ్యంగా అన్నాడు.

ఆమె ఖ్రాన్పడిపోయింది. 'ఇతను మామూలు బిచ్చగాడు కాదు. కోపంలేని మహానుభావుడు. జితేంద్రియుడు' అనుకొంది. అతని పాదాలపై పడి, క్షమాపణ కోరింది. బుద్ధుని శిష్యరికం స్వీకరించింది.

అలాగే ఎదుటివారి తిట్లు, క్రోధాన్ని మనం స్వీకరించకుండా ఉంటే, మనం శాంత స్వరూపులమవుతాం, కోపం మన దరిచేరదు. దీనికి ముందుగా కావలసినది 'నేను, నాది' అనుకోవటం మానుకోవాలి.

*

యథార్థమైన సాక్షాత్కారమును పొందినవాడు పొగడ్తలను, తెగడ్తలను లెక్కించక కర్మలనాచరించును. ఎందుకన అతడు కర్మాచరణములోనే అనందమును గాంచును.

*** *** ***

బ్రతుకునకు దివ్యత్వము కలిగించుటే దానికి సౌందర్యమును జతగూర్చుట.

# తనపని తానే చేసికొనవలె!

-కీ.శే. ఈవూరి రోశిరెడ్డి

చాలా కాలం నాటి సంగతి. ఒకరైతు తన పొలంలో జొన్న పైరు వేశాడు. పనికిరాని కలుపు మొక్కలు తీసివేశాడు. మంచి ఎరువులు వేశాడు. వర్షాలు కురిసి తరుణానికి నీరు అందించింది. పైరుకు చీడలూ, తెగుళ్ళూ రాకుండా రైతు తగు జాగ్రత్త వహించాడు. పైరు ఏపుగా పెరిగింది. పొలం పైరు పచ్చలతో కళకళలాడ సాగింది. పైరు పెరిగి కంకి వేసింది. మరి కొద్ది రోజులకే పంట ప్రారంభమైంది. సస్యలక్ష్మి కళలీనింది.

పొలంలో పైరు పెరగగానే పక్షులు రాసాగాయి. వాటిలో పురిటికి వచ్చిన పక్షి ఒకటి ఉంది. అది పైరు కర్రలను కలుపుకుని కళాత్మకంగా గూడు కట్టుకొంది. నాలుగు నిడుపైన జొన్న కర్రలను కలుపుతూ గడ్డి, పీచుతో సుతారంగా గజిబిజిగా గూడు అల్లుకుంది. సామాన్యంగా ఆ పక్షిని 'గిజిగాడు' అంటారు. ఇందుకేనేమో!

పంటవచ్చేనాటికి పక్షిగుడ్లు పెట్టి వాటిని ఆప్యాంగా పొదిగింది. గుడ్లలో నుండి పిల్లలు వెలికి వచ్చాయి. అవి పసిగా ముద్దుగా ఉన్నాయి. రోజులు గడిచే కొలదీ పక్షులు పెద్దవవుతూ అందంగా రూపొందసాగాయి. అప్పటి దాకా తల్లి పరిసరాల్లోని పురుగులనో, కీటకాల్నో వేటాడి ఆహారంగా తెచ్చి సరిపెట్టుకొనేది. పిల్లలకి కూడా కొంచెం కొంచెం తినిపించి అలరించింది. రాను, రాను పిల్లలు పెరిగే కొలదీ తిండి అధికంగా కావలసి వచ్చేంది. అప్పుడు పక్షి గూటినీ, పిల్లలన్నీ వదలి దూరంగా వెళ్ళి ఆహారాన్ని తెచ్చుకొనేది. ఒక్కొక్కసారి గూటికి రావడానికి చాలా ఆలస్యం అయ్యేది. ఒక్కొక్కరోజు సాయంత్రం దాకా గూడు వదలి ఉండవలసి వచ్చేది.

ఇట్లు పిల్లలు పెరగడంతోపాటుగా పొలంలో పైరు కంకి వెలికి వచ్చి పుష్కలంగా పంట మొదలైంది. పిల్లలకీ రెక్కలు వచ్చి తల్లిపక్షి ముద్దులూ, మురిపాలూ వాటికి బాగా అవగాహన కాగా, లోకం పోకడ, పరిసరాలు, ప్రాణికోటి మసలుకోవడం తెలియవస్తోంది. తిండి తీసుకుని వచ్చిన తల్లితో పిల్ల పక్షులు ఎన్నో కబుర్లు చెప్పేవి. చిన్నారి పిల్లల కబుర్లూ, మాటలూ విని తల్లిపక్షి మురిసిపోయేది.

పొలం పంట ముదిరి, కొద్ది కాలానికి కోతకు రానున్నది. ఒకనాటి విశేషం ఉదయమే తల్లిపక్షి పిల్లలకి తిండి తినిపించి ఆహారం వేటకై బయటకి వెళ్ళింది. పిల్లలు ఆటపాటలతో చిన్న చిన్న రెక్కలూ, తోకలూ ఊపుకుంటూ కేరింతలు కొడుతున్నాయి. యింతలో వాటి గూటి వద్దకు మనుషులు వచ్చి మాట్లాడుకుంటున్నారు. పక్షిపిల్లలు వారిని చూశాయి. ఒకరు పెద్దవాడు, రెండవవాడు చిన్నవాడు. వాళ్ళిద్దరిని చూసిన

పక్షిపిల్లలు వింతగా భయం భయంగా తొంగి చూస్తూ, వారి మాటలు వినసాగాయి. వారిలో పెద్దవాడు అంటున్నాడు –'ఒరేయ్! అబ్బాయి! ఈ సంవత్సరం పొలం బాగా పండింది. ముందుగానే జాగ్రత్తపడి పంటను యింటికి చేర్చాలి. మనం కొద్దిరోజుల్లో కూలివాళ్ళను పంపించి ఈ పొలంలో పైరు కోయిద్దాము" వెంటనే రెండవాడు తల ఊపుతూ '.అవును నాన్నా ! తప్పకుండా కూలివాళ్ళను పంపిద్దాం' అంటూ తండ్రికొడుకులు యిద్దరూ వెళ్ళిపోయారు.

తల్లిపక్షి సాయంత్రానికి తిండి తీసుకొని గూడు చేరగానే పక్షిపిల్లలు జరిగిన విషయం తల్లిపక్షికి వివరించాయి. 'కూలీలు' అన్న మాట వినగానే తల్లిపక్షి మెల్లగా నవ్వుతూ అన్నది. ఫర్వాలేదు. భయం వద్దు. ఆమీదట పిల్లలకి తినిపించి, తానూ తిని హాయిగా విశ్రమించింది.

మరుసటి నాటి నుండి తల్లిపక్షి తన పనులు యధావిధిగా కొనసాగించింది. రోజులు గడిచిపోతున్నాయి. కానీ పొలానికి కూలీలు రాలేదు, పంటకోత జరగలేదు. పక్షి పిల్లలు కూడా యీ సంగతి మరచిపోయాయి. పంట పొలంలో పంట కోతతరుణం మీరిపోవచ్చింది. మరి కొన్నాళ్ళకు ఉదయం వేళ కొడుకుతో పాటు రైతు పొలానికి వచ్చాడు.పొలంలోని పంటను పరిశీలించి యిలా అన్నాడు – 'ఒరేయ్! బాబూ! కూలీలు అనుకొన్న ప్రకారం రాలేదు. తరుణం మించితే పంట తగ్గుతుంది. కాబట్టి మన బంధువుల్ని పంపించి త్వరలో పంట వెంటనే కోయించాలి. త్వరపడాలి. తండ్రి మాటలకు కొడుకు కూడా తలూపుతూ అన్నాడు 'అలాగే నాన్నా! మన చుట్టాలను పంపిందాం' మాట్లాడుకుంటూ తండ్రీకొడుకులిద్దరూ యింటిదారి పట్టారు.

గూటిలో నుంచే పక్షులు కిందటిసారిలాగానే తిలకించాయి. ఈసారి వాటికి భయం లేకపోగా వినోదంగా ఉంది. సాయంకాలానికి రైతుమాటలు వినిపించాయి. తల్లిపక్షి బందువులు. చుట్టాలు అనేమాట వినగానే తాపీగా గాలిపీల్చింది. భయం లేదనే సూచనగా రెక్కలు టపటపలాడిస్తూ తెచ్చిన తిండి తనివితీరా తనూ, పిల్లలూ తిని నిశ్చింతగా నిద్రించింది.

తల్లిపక్షి మరునాటి నుండి యధావిధిగా ఆహార సంపాదనకోసం వెళ్ళసాగింది. కాలం గడచిపోయింది. కానీ పొలం కోత జరగలేదు. కూలీలూ, బంధువులు ఎవరూ చేను దరికి రానేలేదు. పంటపండి వాలిపోవటానికి సిద్ధంగావుంది. బహుశ! సంగతి గ్రహించిందేమో తల్లిపక్షి నింపాదిగా పిల్లలతోపాటు గూటిలో గడపసాగింది.

మరికొన్ని రోజులు తరువాత తల్లిపక్షి ఆహార సముపార్జనకై వెళ్ళిన సమయంలో పొలం యజమాని కొడుకుతో సహా పొలానికి వచ్చాడు. పంటను చూసిన రైతు మనస్సు

చివుక్కుమంది. వెంటనే కొడుకుతో ఆవేశంగా అన్నాడు –‘ ఒరేయ్! మనం యిప్పటిదాకా యితరులపై ఆధారపడి పొరపాటు చేసాం. నమ్మినవాళ్ళు ఎవరూ మన పని చేసి పెట్టలేదు. కోత సకాలంలో జరగనందున నష్టం జరిగేలా ఉంది. ఇప్పుడు మనమే స్వయంగా పంటకోత చేసుకుందాం’ అంటూ తండ్రి స్వయంగా పంటకోత మొదలు పెట్టగానే కొడుకు కూడా ‘నిజమే నాన్నా!’ అంటూ తండ్రిని అనుసరించటం మొదలు పెట్టాడు. ఈలోగా తల్లిపక్షి ఆహారంతో సహా వచ్చింది. పిల్లపక్షులు చెప్పిన వివరాలతో వెంటనే తాను అప్రమత్తమై పిల్లలతో సహా అప్పటికప్పుడే పంట పొలంలోని గూటిని వదిలి వేరే సురక్షితమైన ప్రాంతానికి తరలి పోయింది.

తరువాత ఆలస్యంగానైనా పంటకోసి, కుప్పవేసి, నూర్పించి, గింజలను బస్తాలతో నింపి తండ్రీకొడుకులిద్దరూ యింటిదారి పట్టారు. కోత కోయడంతో జరిగిన జాప్యం వల్ల పంటనేలకొరిగి రాలిపోయిన ధాన్యం వృథాగా పోయినా మిగిలిన జొన్నలతో రైతు కొంత నష్టం భరించవలసి వచ్చింది.

ఈ కథ ఆధారంగా శ్రీబాబూజీ తరచు భక్తులకు వివరించే ప్రబోధ సారం ఇదే. ప్రతివానికీ మూలం లోనే గూడుకట్టుకొని అజ్ఞానం ఉంటుంది. దానిని మూలజ్ఞానం అని కూడా అంటారు. దాని నుండి బయటపడినప్పుడే జీవితంలో సుఖశాంతులు లభిస్తాయి. అయితే ఎవరికి వారే కృషి చేసుకుని దాని నుండి విముక్తులు కావాలి. ఇతరుల మీద ఆధారపడితే అనర్థమే. సద్గురుదేవుల అనుగ్రహం సంపాదించి తనను ఉద్ధరించుకోవాలి అదే ఉత్తమమైన రాజమార్గం!

దీనికి భగవద్గీతలో ప్రమాణమున్నది ఇదే *ఉద్ధరేదాత్మ నాత్మానం* .ఇదే అందరికీ శిరోధార్యం. ఆ మార్గానికి రాజద్వారమే శ్రీబాబూ విజ్ఞానమందిర ప్రాంగణం!

*

1. నీ కళ్ళు దయా దృష్టితో చూడనీ, నీ నాలుక సౌమ్య వచనములను పలుకనీ, నీ హస్త స్పర్శ మృదులమై ఉండనీ.
2. ప్రేమ క్షమా స్వభావము కలది, ప్రేమ వివేకమును ఒసగ గలది.
3. ప్రేమ కష్టముల నుండి గట్టెంక్కించగలది మరియు పరివర్తన మొనర్చ గలది. అట్టి ప్రేమ మనకు రక్షణ కవచము.
4. ఎడబాటు అను స్వప్నము నుండి మేలుకో. వాడూ నీవూ విడియై రెండుగా లేనట్లు ఎరుగుము. బ్రతుకంతా ఒక్కటే.

–స్వామి రామదాస

# విష్ణు కథలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

## 3.తులసీదాసు

### తులసీదాసు ప్రభావంచే పిశాచానికి శాపవిముక్తి కలుగుట.

తులసీదాసు 12 ఏళ్ళు ఒక బండ మీదనిలచి కాళ్ళు కడుక్కుంటూ ఉండేవాడు. ఒక రోజు ఆరాతినుండి ఒక గొప్ప భూతం ఆవిర్భవించి "నీకేమి కావాలో చెప్పు, నేను వెంటనే సమకూరుస్తాను" అన్నది. తులసీదాసు "నువ్వు ఎవరివి" అని అడగగా, నేను ఈ బండరాయి లో నివసిస్తున్న పిశాచాన్ని. నీ పాదతీర్థ ప్రభావంచేత నాకు పాపవిముక్తి లభించింది. నీకు ప్రత్యుపకారం చేయాలని ఉంది. ఆదేశించు" అనగా "నాకేమి అక్కరలేదు ఇక్కడనుంచి వెళ్ళు "అన్నాడు. ఆ పిశాచం ''అయ్యా! కోపించకండి మీకు కావలసింది శ్రీ రామ దర్శనవేకదా నేను నాప్రభువైన భేతాళునితో చేయిస్తాను అని భేతాళు



డి వద్దకు తీసుకు వెళ్ళింది. భేతాళుడు "నేను శ్రీ రాముని దర్శనం చేయించలేనుగానీ హనుమంతుని దర్శనం చేయిస్తాను. ఆయన అనుగ్రహంతో మీకు శ్రీ రాముని దర్శనం లభిస్తుంది" అని "కాశీలో అసి ఘట్టంలో ఒక పౌరాణికుడు ప్రతి సాయంకాలం శ్రీ రామాయణ కథను వినిపిస్తున్నాడు. అక్కడ ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపంలో ఆంజనేయుడు అక్కడికి వస్తున్నాడు. నీవు ఆయనను దర్శించు" అన్నాడు.

"అంతమందిలో ఆయనను తెలిసికోవటం ఎలా" అని అడిగాడు తులసీదాసు. అతనిలోగల కొన్ని ముఖ్య లక్షణములు వివరిస్తాను విను. "ప్రతి సాయంత్రం అందరికంటే ముందుగా వస్తాడు. పురాణ కాలక్షేపం ముగిసిన తరువాత చివరగా వెళతాడు. విరామం లేకుండా రామనామం జపిస్తూ వుంటాడు. ఈ గుర్తులతో నీవు ఆయనను గుర్తుపట్టగలవు. ముందుగా ఆయన పాదాలను గట్టిగా పట్టుకో, నిన్ను అనుగ్రహిస్తాడు" అని చెప్పి అదృశ్యమయ్యాడు.

## తులసీదాసుకు హనుమంతుని అనుగ్రహం లభించుట

తులసీదాసు ఆ పురాణకాలక్షేపం జరిగే చోటుకు వెళ్ళి ఆ వృద్ధ బ్రాహ్మణుడి కోసం ఎదురు చూస్తుండగా ఆ బ్రాహ్మణుడు రావటం గమనించి ఆయనకు నమస్కరించి "స్వామీ మీరెక్కడ ఉంటారు" అని అడిగాడు. ఆయన ఆ మాటలు వినకుండా ఒక్క ఉదుటున పురాణకాలక్షేపం జరిగే చోటుకి చేరుకున్నాడు. పురాణ ప్రవచనం అయిన తరువాత ఆ బ్రాహ్మణుని సమీపించి "స్వామీ మీకు సేవచేసికొనే భాగ్యాన్ని ప్రసాదించండి. నన్ను మీ నివాసానికి తీసుకువెళ్ళండి" అన్నాడు తులసీదాసు.

"నేను చాలా దూరంలో ఉంటాను. నువ్వు నాతో రాలేవు. నేను ఒంటరిగా ఉంటాను. ఇతరుల పొత్తు నాకు కుదరుదు" అన్నాడు. తులసీదాసు "మీ వద్ద ఉపదేశం పొందాలని ఉంది నన్ను అనుగ్రహించండి" అన్నాడు.

ఆంజనేయస్వామి "నేను అంత శక్తివంతుడునుకాను. నాకు మంత్రాలు తంత్రాలు రావు. నువ్వు ఆ పౌరాణికుణ్ణే ఆశ్రయించు. నన్ను అనుసరించకు" అని వేగంగా నడుస్తూ ముందు నడుస్తున్న వారిలో కలసి మాయమైనాడు.

తులసీదాసు వారందరిలో అతనిని వెదకటం మొదలు పెట్టాడు. కాని అతడు కనపడలేదు. ఆ మర్నాడు అంజనేయుడు తనరాకకై వేచియున్న తులసీదాసును చూసి, అతని నుండి తప్పించుకొని వేగంగా నడవటం మొదలుపెట్టాడు. తులసీదాసు అది గమనించి పరిగెత్తి అతని కాళ్ళు గట్టిగా పట్టుకొని "స్వామీ! నిన్న నన్ను మీరు మోసగించినారు. ఇప్పుడు మిమ్మల్ని వదలను" అని గట్టిగా ఆయన కాళ్ళు పట్టుకొన్నాడు.

ఆంజనేయ స్వామి కోపించి "ఛీ! మూర్ఖుడా! పురాణానికి వెళుతున్న నాదారికి అడ్డంగా వస్తావేమిటి? నా కాళ్ళు విడిచిపెట్టు దారి తొలుగు" మని మందలించాడు. దానికి తులసీదాసు "అయ్యా! ముందుగా మీరు ఎవ్వరో నాకు తెలియచేయండి. నన్ను తప్పించుకు పోవటానికి కారణం ఏమిటో చెప్పండి" అన్నాడు. హనుమంతుడు "నేను ఎవరైతే నీ కేమిటి? నాకు నీకు సంబంధం ఏమిటి? నీ ముఖం ఇదివరకు ఎన్నడూ చూడలేదు. రెండు రోజులనుంచి నా వెంటపడుతున్నావు. ఛీ! ఫో!. అని గట్టిగా మందలించాడు. "నీ వాస్తవరూపం నాకు తెలియజేస్తేగాని నిన్ను విడువను" అని బలవంతపెట్టాడు తులసీదాసు. కోపావేశంతో కాళ్ళు విదిలించుకొని "తుచ్ఛుడా! ఎవడువురా నీవు? పురాణానికి వెళ్తున్న నన్ను అడ్డగిస్తున్నావు. ఇంకొకసారి అడ్డం వచ్చావంటే ఎముకలు విరగగొడతాను" అని చెప్పి పురాణానికి వెళ్ళాడు.

తులసీదాసు ఇతడు ఆంజనేయుడే! పురాణాన్నుంచి బయటకు రాగానే పట్టుకోవాలి అని వాకిట్లో నిలబడ్డాడు. పురాణ ప్రసంగం అయిపోయింది. తులసీదాసు

వెళ్ళాడా లేదా అని కొంతసేపు లోపలే ఉండి గమనిస్తున్న ఆంజనేయస్వామిని చూసి "స్వామీ! మీ కొరకే కాచి ఉన్నాను" అని లోపలికి వచ్చాడు.

ఆంజనేయస్వామి బయటకు వచ్చి అంతర్ధానమయ్యాడు. దిగ్భ్రామచెంది నలుదిశల పరుగెత్తి వెతికి, వేసారి మర్నాడు పొద్దుటే వచ్చి పౌరాణికుని ఇంటివద్ద సాయంకాలం వరకు కాపలా కాశాడు. ఆంజనేయమూర్తి మరొక మార్గంలో వచ్చి పురాణం వింటున్నాడు. చాలాసేపు బయట కాపు కాసిన తులసీదాసు మందిరం లోపలికి వెళ్ళిచూడగా వృద్ధ బ్రాహ్మణుడు కనిపించాడు. తులసీదాసు ఆయనకి భక్తి శ్రద్ధలతో నమస్కరించి "స్వామీ! తమరు ఏ దారిలో లోపలకి వచ్చారో చెప్పండి" అన్నాడు. ఆంజనేయుడు అతనిని చూడనట్లే నటించి మరోవైపు తిరిగి రామనామస్మరణ చేసికొంటున్నాడు.

తులసీదాసు "స్వామీ! నేను ఏమి అపరాధం చేశానని పెడమొఖం పెట్టుకొన్నారు.? నామీద కనికరం లేదా? నేను మిమ్మల్ని వదలను అని మాటిమాటికి పిలవసాగాడు.

ఆంజనేయమూర్తి " ఓరీ దుర్మార్గుడా !భక్తిగా రామాయణం వింటూంటే ఏమిట్రా గొణుగుతున్నావు? ఒక మూలకూర్చో!" అని మందలించాడు. "స్వామీ మీరేమార్గంలో వచ్చారో చెప్పండి" అన్నాడు తులసీదాసు.

-సశేషం

నీ ప్రేమతో సంపూర్ణముగా నిండిన నీ హృదయముతో భగవంతుని పిలువుము. ఆ పిలుపును సంపూర్ణముగా నీ ఆకాంక్షతో నింపుము. నీ పిలుపునకు అపుడు భగవంతుడు తప్పక బదులిచ్చునని విశ్వసింపుము.

***          ***          ***

విశ్వము యొక్క సమస్త భారము విశ్వాత్మునిపైన ఉన్నది. నీ భారము కూడా వానిపైన ఉన్నట్లే గుర్తించు. ఏనాటికీ దానికి వేరే ఆధారము లేదు.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL